
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.5
కనిష్ఠం 24.0
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 28 అక్టోబరు 2025



ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.00 (305.9222)	36,960	36,960
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	5,015.38	5,015.38
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.176 (41.4867)	33,755	57,858

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి

- ఉత్కంఠగా సాగిన డ్రా ప్రక్రియ
- దర్వేశిపురం దుకాణాన్ని దక్కించుకున్న మహిళ
- ముక్కాముల మహేష్‌కు ఐదు దుకాణాలు..



మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ తీస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉత్కంఠభరిత వాతావరణంలో మద్యం దుకాణాల లైసెన్స్‌దారుల ఎంపిక పూర్తయింది. 2025-27 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణకు లైసెన్స్‌లు ఇచ్చేందుకు ఇటీవల దరఖాస్తులను ఆహ్వానించగా, జిల్లాలో 154 దుకాణాలకు అత్యధికంగా 4,906 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి సమక్షంలో లక్కీడ్రా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు మొదలైన ఈ కార్యక్రమం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎక్సైజ్ అధికారి బి.సంతోష్‌కుమార్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లక్కీడ్రాకు దరఖాస్తుదారులంతా కుటుంబసభ్యులు, భాగస్వాములతో కలిసి హాజరయ్యారు. దీంతో లక్కీడ్రా నిర్వహించే లక్ష్మీగార్డెన్స్ ప్రాంతమంతా కిటకిటలాడింది. డ్రా పూర్తయ్యేంతవరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు పోలీసులు కట్టుదిట్ట బందోబస్తు నిర్వహించారు.

కార్యక్రమం మొత్తం వీడియో రికార్డింగ్

జిల్లాలోని 154 మద్యం దుకాణాలకు సోమవారం లైసెన్స్‌దారులను లక్కీడ్రా ద్వారా ఎంపికచేశారు. ప్రతీ దుకాణానికి వచ్చిన దరఖాస్తులకు టోకెన్ నెంబర్లు కేటాయించి వాటిని ఓ బాక్సులో వేసి డ్రా తీశారు. నిబంధనల ప్రకారం కలెక్టర్ స్వయంగా లక్కీడ్రా కార్యక్రమం కొనసాగించారు. మొత్తం 154 దుకాణాలకు సంబంధించి డ్రా పూర్తయ్యేంతవరకు కార్యక్రమాన్ని వీడియో రికార్డింగ్ చేశారు. డ్రా తీసేటప్పుడు ఆయా దరఖాస్తుదారుల పేర్లు చదివి టోకెన్ నెంబర్లను కేటాయించి అందరి సమక్షంలోనే డ్రాతీసి, దుకాణం దక్కించుకున్న వారి పేరుని ప్రకటించారు.

దర్వేశిపురం దుకాణం మహిళకు

జిల్లాలో అత్యధిక దరఖాస్తులు వచ్చిన కనగల్ మండలం దర్వేశిపురం మద్యం దుకాణాన్ని తిప్పర్తికి చెందిన ఉయ్యాల రాములమ్మగౌడ్ దక్కించుకున్నారు.

- మిగతా 8వ పేజీలో...

పారదర్శకంగా దుకాణాల కేటాయింపు



జిల్లాలో 154 మద్యం దుకాణాలకు సోమవారం పారదర్శకంగా లాటరీ పద్ధతిలో లైసెన్స్‌దారుల ఎంపిక నిర్వహించాం. మొత్తం 4,906 దరఖాస్తులు రాగా, వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.147.18కోట్ల ఆదాయం వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రేటర్ హైదరాబాద్ తర్వాత జిల్లాలోనే అత్యధిక దరఖాస్తులు వచ్చాయి. దుకాణాల నిర్వహణకు ఎంపికైన వారు మంగళవారం సాయంత్రంలోగా దుకాణానికి సంబంధించి ఆరోవంతు లైసెన్స్ ఫీజు చెల్లించాలి. మొత్తం నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తాం. జిల్లాలో గౌడ సామాజికవర్గానికి 34, ఎస్సీలకు 14, ఎస్టీలకు 4 దుకాణాలను కేటాయించగా, మిగిలినవన్నీ ఓపెన్ కేటగిరీలో ఉన్నాయి.

- ఇలా త్రిపాఠి, కలెక్టర్

ఆర్టీసీలో ఇవేం నిర్ణయాలు!

» బస్టాండ్లలో టికెట్ కౌంటర్ల ఎత్తివేత » నాన్‌స్టాప్ బస్ ప్రయాణికులకు ఇబ్బందులు » డ్రైవర్లకు టిమ్స్ యంత్రాలు అందజేత

ఆర్టీసీ అధికారులు ఓ వైపు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూనే మరో వైపు ఇబ్బందులకు గురిచేసేలా నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ప్రధానంగా నాన్‌స్టాప్ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందులు కలిగేలా కౌంటర్లను ఎత్తివేయాలని యోచించడం వివాదాస్పదంగా మారింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



నల్లగొండ బస్టాండ్‌తో పాటు ముఖ్యమైన పట్టణాల్లోని బస్టాండ్లలో ఏర్పాటు చేసిన కౌంటర్లను నిలిపివేయాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే నల్లగొండ బస్టాండ్‌లో నిలిపివేయగా ప్రయాణికుల నుంచి ఒత్తిడి వచ్చిన సమయంలో అప్పుడప్పుడు మళ్లీ కౌంటర్లలో టికెట్లు ఇస్తున్నారు. ఆదివారం లేదంటే పండుగల సమయాలు, ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్నప్పుడు మాత్రమే కౌంటర్లను నిర్వహించాలని, సాధారణ రోజుల్లో కౌంటర్లు అవసరం లేదని అధికారులు భావిస్తున్నారు. జిల్లా కేంద్రమైన నల్లగొండలో ప్రతీ 15 నిమిషాలకోసారి హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ బస్సులు నడుస్తున్నాయి. ప్రతీ రోజు ఉదయం 5 నుంచి రాత్రి 9గంటల వరకు బస్సులు నడుస్తున్నాయి. పల్లె వెలుగుతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన నేపథ్యంలో ఆ బస్సుల్లో రద్దీని తట్టుకోలేక హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు అధిక సంఖ్యలో ఉంటున్నారు. ప్రతీ 15 నిమిషాలకు ఒకసారి నడిచే బస్సులు నిండిన తరువాతనే ఇతర బస్సులకు టికెట్‌లు ఇస్తున్నారు. అయినా ప్రతీ నాన్‌స్టాప్ బస్సు సీట్లు నిండుతున్నాయి. నల్లగొండ బస్టాండ్‌లో నాన్‌స్టాప్ బస్సుల్లో ఆరు సీట్లను మినహాయించి టికెట్లు ఇస్తున్నారు. ఆ ఆరు సీట్లకు జిల్లా కేంద్రంలోని ఐటీ హబ్ ఎదురుగా ఉన్న టికెట్ కౌంటర్‌లో టికెట్ జారీ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు కౌంటర్లు రద్దయ్యాయి. నార్కట్‌పల్లి పరిసర ప్రాంతాలల్లోని నాన్‌స్టాప్ బస్సుల్లో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం నార్కట్‌పల్లి సమీపంలోని బైపాస్ వద్ద కౌంటర్ ఏర్పాటు చేసి టికెట్ ఇవ్వాలని భావించినా, ప్రస్తుతం దాన్ని సైతం నిలిపివేసినట్లు సమాచారం. నల్లగొండ బస్టాండ్‌లో కౌంటర్లల్లో ఆయా నాన్‌స్టాప్ బస్సుల డ్రైవర్లే టికెట్ ఇచ్చి, ఆ తరువాత బస్సులు నడుపుతున్నారని, దానికి బదులు బస్సులోనే డ్రైవర్లకు టిమ్స్ యంత్రాలు ఇచ్చి టికెట్‌లు ఇవ్వాలని ఆర్టీసీ అధికారులు భావించారు. ఈ మేరకు డ్రైవర్లకు టిమ్స్ యంత్రాలు అందజేశారు. అయితే కౌంటర్లు ఎత్తివేయడంతో నాన్‌స్టాప్ బస్సు రాగానే పరుగుపరుగున వెళ్లి సీట్లలో కూర్చోవడం లేదంటే ఆయా సీట్లలో కర్చీఫ్‌లు వేసి సీట్లు దక్కించుకునే పరిస్థితులు తిరిగి వచ్చాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటి వరకు ప్రయాణికులు కౌంటర్ వద్ద క్యూలైన్‌లో నిలబడి టికెట్ తీసుకొని వారికి కేటాయించిన సీట్లల్లో కూర్చొని గమ్యాన్ని చేరుకునే వారు. కౌంటర్ల వద్ద మహిళలకు, పురుషులకు వేర్వేరు కౌంటర్లు ఉండేవి. ఈ కౌంటర్లను తొలగించడంతో నాన్‌స్టాప్ బస్సు ప్రయాణికులు, ప్రధానంగా మహిళలు ఇబ్బందులు పడతారని పలువురు వాపోతున్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదుల పరిష్కారంపై

ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అదనపు కలెక్టర్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజల నుచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలన్నారు. ఎంతో దూరం నుంచి సమస్యల పరిష్కారానికై ఫిర్యాదుదారులు జిల్లా కేంద్రానికి వస్తున్నారని, ఈ కారణంగా సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా సోమవారం మొత్తం 98 ఫిర్యాదులు రాగా, జిల్లా అధికారులకు 53, రెవెన్యూశాఖకు 45 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, దేవరకొండ, చండూరు ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

నల్లగొండ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గ్రీవెన్స్‌డే సందర్భంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 55మంది అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. కచ్చితంగా న్యాయం జరుగుతుందని బాధితులకు భరోసా కల్పించారు. అలాగే చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిస్థితులకు భంగం కలిగించే వారిపై, నేరస్థులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

సొంతింటి నిర్మాణం ప్రతి ఒక్కరి కల

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేసుకోవాలి
గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి పత్రాలను అందజేస్తున్న పీడీ రాజ్‌కుమార్, కాంగ్రెస్ నేత మోహన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) సొంతింటి నిర్మాణం ప్రతి ఒక్కరి కల అని గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణ పరిధిలోని 14వ వార్డు మర్రిగూడలో నూతి లక్ష్మయ్య దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఇందిరమ్మ ఇంటిని త్వరితగతిన పూర్తి చేసుకున్నందుకు ఈ సందర్భంగా లబ్ధిదారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా సకాలంలో ఇంటి నిర్మాణం పూర్తి చేస్తే వారికి బిల్లు కూడా త్వరగా వస్తుందన్నారు. 14వ వార్డులో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో 14వ వార్డులోని మర్రిగూడ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని అన్నారు. పార్టీలకతీతంగా ఇల్లు లేని వారందరికీ ఇండ్లు మంజూరు అవుతాయని తెలిపారు. ఇప్పటివరకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల మొత్తం పూర్తి అయితే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ తీసుకున్న వారంతా తప్పనిసరిగా ఇంటిని కట్టుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇందిరమ్మ ఇళ్ల పూర్తి అయ్యేంతవరకు తమ వంతు సహకారం అందించాలని అన్నారు. మర్రిగూడలో కొన్ని కాలనీలలో మిగిలి ఉన్న సీసీ రోడ్లను వేయిస్తానని అన్నారు. అదేవిధంగా 14వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించి మర్రిగూడ అభివృద్ధికి అన్ని విధాలుగా తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ బొజ్జ శంకర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గురిజ వెంకన్న, కాంగ్రెస్ నాయకులు చంద్రారెడ్డి, నాగిరెడ్డి, జాన్ రెడ్డి, సుంకరబోయిన మధు, సత్తయ్య, సాయి, వినేష్, వెంకన్న, సైదులు. ఇస్తారి, రాములు, సుధాకర్, రవి, సైదులు, మహేందర్, చిరంజీవి, ఎల్లేష్, లక్ష్మీనారి తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రుల ఆదేశం

నల్లగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుపాన్ నేపథ్యంలో ధాన్యం, పత్తి కొనుగోళ్లలో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సకాలంలో ధాన్యం, పత్తి కొనుగోలు చేసి రైతులకు నష్టం కలగకుండా చూడాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఇప్పటివరకు 80శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, 41వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. జిల్లాలో 23 జిన్నింగ్ పత్తి మిల్లులు ఉన్నాయని, అందులో 9 ఎల్-1 కేంద్రాలు ఉన్నాయని, మునుగోడు, దేవరకొండతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాల నుంచి కొంత పత్తి వస్తోందని అన్నారు. పత్తి సేకరణకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ అమిత్, డీఆర్‌డీవో శేఖర్ రెడ్డి, పౌరసరఫరాల అధికారి వెంకటేష్, పౌరసరఫరాల సంస్థ డీఎం గోపికృష్ణ, మార్కెటింగ్ ఏడీ ఛాయదేవి, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు (ఇన్‌సెట్లో) పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కనగల్: ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. సోమవారం మండలంలోని పగిడిమర్రి గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలుకు ఎంపిక చేసిన స్థలం మరీ చిన్నదిగా ఉండటం, ఇటీవల కురిసిన వర్షాలకు కేంద్రంలో ధాన్యం రాశులు తడవడాన్ని గుర్తించిన కలెక్టర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు సెంటరు ఇన్‌చార్జికి కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం రాశులు తడవకుండా రైతులు టార్పాలిన్ పట్టాలను కప్పి ఉంచాలన్నారు. రైస్‌మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా ధాన్యం లోడ్‌లను ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలన్నారు. శుభ్రపర్చిన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో సుమలత, ఏవో అమరేందర్ గౌడ్, ఏపీఎం మైసేశ్వర్‌రావ్, నాయకులు అనూప్ రెడ్డి, రాజారెడ్డి, జగాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, క్రిష్ణారెడ్డి, కేశవరెడ్డి తదితరులున్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతూ కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి కలెక్టర్‌కు పగిడిమర్రిలో వినతి పత్రం అందజేశారు. ధాన్యం కాంటాలు ఆలస్యమై రోజుల తరబడిగా రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని వివరించారు. తేమ, తరుగు పేరుతో ధాన్యం దిగుమతిలో ఆలస్యం చేస్తున్న రైస్ మిల్లర్లపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి రైతులకు మద్దతు ధర అందేలా చూడాలని కోరారు.

బియ్యం పరిశ్రమను కబళిస్తున్న కార్పొరేట్లు

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి



మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

మిర్యాలగూడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రాధాన్యం కలిగిన బియ్యం పరిశ్రమను కూడా కార్పొరేట్ కంపెనీలు కబళిస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లిలో సోమవారం నిర్వహించిన తెలంగాణ ఆల్ హమాలీ ఫెడరేషన్ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్పత్తి రంగంలో కీలకంగా ఉన్న బియ్యం పరిశ్రమలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు లక్ష మంది, రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది హమాలీ పనిచేస్తున్నారని అన్నారు. వీరికి ప్రభుత్వం ఎటువంటి చట్టబద్ధమైన హక్కులు కల్పించలేదని అన్నారు. ఎఫ్‌సీఐ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థను, గోడౌన్లను ప్రైవేటు పరం చేస్తున్న మోదీ ప్రభుత్వం, అతి పెద్ద రైసుమిల్లులను నెలకొల్పేందుకు అదానీ, అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలు ఇస్తోందని, ఈ పరిణామం ఆర్థికం రంగంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని అన్నారు. మరో వైపు యాంత్రీకరణతో అనేక మంది హమాలీలు ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలతో ఉపాధి మరింతగా మృగ్యం అవుతోందని అన్నారు. జీవో నెం.8 ద్వారా అవుట్‌సోర్సింగ్ రంగంలోని వారికి 8 గంటల పని విధానం స్థానంలో 12గంటలకు పెంచిన ప్రభుత్వం, కార్మికుల ఎలాంటి హక్కులు లేకుండా చేస్తోందని విమర్శించారు. ఐకేపీ కేంద్రాల్లోని హమాలీలకు రైతులు చెల్లిస్తేనే కూలీ డబ్బులు అందుతున్నాయని అన్నారు. కార్మికుల హక్కుల కోసం ఇటీవల నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో దేశవ్యాప్తంగా 25 కోట్ల మంది కార్మికులు పాల్గొన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి అన్ని రకాల సదుపాయాలను, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, తిరుపతి రాంమూర్తి, అవుట సైదులు, రొండి శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

నల్లగొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 29న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావొస్తుండగా, స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.9వేల కోట్లు విద్యార్థులకు ప్రభుత్వం బాకీ పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగంపై దృష్టిసారించాలన్నారు. 29న జరిగే ముట్టడికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చల్లా కోటేష్, పిల్లి అభినయ్, అంబటి ప్రణీత్, నోముల శంకర్, నోముల క్రాంతి, లింగయ్య, లక్ష్మణ్ కుమార్, శివకుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

● కార్తీకం.. శుభకరం



పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో..

కార్తీక మాసంలో తొలి సోమవారం కావడంతో జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. సాయంత్రం ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజల్లో పాల్గొన్నారు.

8

నాణ్యమైన పత్తికి మద్దతు ధర



మాదారంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి

శాలిగౌరారం మార్కెట్ చైర్మన్ శంకర్‌రెడ్డి

శాలిగౌరారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మాదారంలోని టీటీఆర్ కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు పత్తి విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, తహసీల్దార్ బిట్ల వరప్రసాద్, మార్కెట్ కార్యదర్శి చిన్నానాయక్, ఏవో సౌమ్యశృతి, సీసీఐ సీపీవో రవీందర్, కాటన్ మిల్లు యజమాని తానం జోజిరెడ్డి, మాదారం మాజీ ఎంపీటీసీ నోముల జనార్దన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజుల శ్రీనివాస్, నాయకులు గైగుల అవిలయ్య, దేవరకొండ జయరాజు, తుక్కాని లక్ష్మీనరసింహారెడ్డి, షేక్ లతీఫ్, పడాల రమేష్, రవి కుమార్, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో లక్కీడ్రా విజేత ఆనందం

లక్కీడ్రాలో.. మద్యం దుకాణం → దక్కిందోచ్

ఎన్నాళ్లుగానో ఎదురు చూసిన విజయం వరించింది. మద్యం టెండర్లకు నిర్వహించిన లక్కీడ్రాలో పలువురు ఎంపికయ్యారు. రెండేళ్లపాటు మద్యం దుకాణాలు దక్కించుకున్న టెండరుదారుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా సోమవారం మద్యం షాపులకు లక్కీడ్రా నిర్వహించారు. డ్రా నిర్వహించే ప్రదేశాలు సందడిగా మారాయి. టెండర్‌దారులు, వారి కుటుంబ సభ్యుల రాకతో వాహనాల సందడి నెలకొంది. ఆ సమీప ప్రదేశాలు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఎలికట్టె భరత్-శ్రావణి దంపతులు రెండు దుకాణాలు దక్కించుకోవడం విశేషం.



నల్లగొండ జిల్లాకేంద్రంలో విజేతల ఆనందం



నల్లగొండలో డ్రాలో పాల్గొనేందుకు వచ్చిన మహిళలు



నల్లగొండలో డ్రాలో పాల్గొనేందుకు వచ్చిన వారి వాహనాలు



నల్లగొండలో డ్రా అనంతరం వెనుదిరిగిన మహిళలు



సూర్యాపేటలో లక్కీ డ్రాలో రెండు దుకాణాలు దక్కించుకున్న భార్యాభర్తలు ఎలికట్టె భరత్-శ్రావణి

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

రామన్నపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు గేదెలు సోమవారం మృతి చెందాయి. వివరాల్లోకి వెళితే.. కక్కిరేణి గ్రామానికి చెందిన కన్నెబోయిన నరసింహ గేదెలను మేపుతుండగా విద్యుత్ తీగలు తెగి గేదెలపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి.

బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ఓ వరం

నల్లగొండ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ఓ వరంలాంటిదని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు సంబంధించి ట్రేస్‌చేసి రికవరీ చేసిన 47 ఫోన్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లకు పాస్‌వర్డ్‌లు పటిష్టంగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డితో పాటు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మహిళల మెడలో పుస్తెలతాడు చోరీ



బైక్‌పై పారిపోతున్న దొంగలు

త్రిపురారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ జరిగిన సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం నీలాయిగూడెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కైగురి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఉమ్మడి శకుంతల పొలానికి వెళ్లి వస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి పుస్తెలతాడును లాక్కొని పరారీ అయ్యారు. శకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

శాలిగౌరారం: ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసును చోరీ చేసిన సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది.శాలిగౌరారం ఎస్‌ఐ డి.సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన మన్నె శిరీష కుటుంబసభ్యులతో ఇంట్లో నిద్రిస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి 3 తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

వీధికుక్కల దాడిలో గాయాలు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వీధికుక్కల దాడిలో ఏడేళ్ల విద్యార్థి గాయపడిన సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో సోమవారం జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. హౌసింగ్ బోర్డుకు చెందిన లావూరి నాగరాజు కుమారుడు హర్షవర్ధన్ పాఠశాలకు వెళ్లి ఇంటికి వస్తుండగా, వీధి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఈ సంఘటనలో బాలుడు హర్షవర్ధన్ తల, కంటిపై బలమైన గాయాలయ్యాయి.

భువనగిరి రూరల్: భువనగిరి మండలం అనాజీపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఓ విద్యార్థిని కుక్కలు గాయపరిచాయి. గ్రామానికి చెందిన సిర్పంగ భరత్‌కుమార్ పాఠశాల గదిలోంచి బయటకు వస్తుండగా మోచేతిపై దాడి చేసి గాయపరిచాయి.

సాగర్ కాల్వలో మృతదేహం లభ్యం

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):నల్లగొండజిల్లా మిర్యాలగూడ మండలం కురియతండా వద్ద సాగర్ కాల్వలో గల్లంతైన వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఈ నెల 25న తండాకు చెందిన ధనావత్ ద్వారజన్(80) దుస్తులు ఉతకడానికి సాగర్ ఎడమకాల్వలోకి దిగింది. ఈ క్రమంలో పట్టుతప్పి కాల్వలోకి జారిపడి గల్లంతైంది. ఆమె ఆచూకీ కోసం గాలిస్తుండగా సోమవారం గరిడేపల్లి మండలం పొనుగోడు రిజర్వాయర్‌లో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చినట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

11 మంది జూదరుల అరెస్ట్

మునగాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న 11 మందిని పోలీస్‌లు అరెస్ట్ చేసి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23న మండలంలోని నర్సింహులగూడెం గ్రామశివారులో రేకుల షెడ్‌లో జూదం అడుతున్న వారిని పట్టుకున్నట్లు తెలిపారు. కమ్మంపాటి అశోక్, కమ్మంపాటి శ్రీనివాస్, చింతమళ్ల ప్రభుదాస్, షేక్ సైదా, ఉయ్యాల కాటంరాజు, బెజవాడ వెంకన్న, ముంత కృష్ణ, జుట్టుకొండ రామారావు, బొల్లెద్దు రామకృష్ణ, కేశబోయిన నాగరాజు, బొల్లం సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఇసుక లారీ పట్టివేత

కోదాడ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఇసుక లారీని పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా తోట్లవల్లూరు మండలం రొయ్యూరు నుంచి అనుమతి లేకుండా హైదరాబాద్‌కు లారీలో ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. లారీ డ్రైవర్ లుక్క నాగరాజు, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వైన్స్ దుకాణంలో స్వల్పంగా మంటలు

మోత్కూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండల కేంద్రంలో ఆర్ఎస్ వైన్స్‌లో సోమవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. మూసి ఉన్న దుకాణం నుంచి బయటికి పొగ రావడంతో ఉదయం వేళ ఇరుగు పొరుగు గమనించి దుకాణ యాజమానికి, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వెంటనే దుకాణం వద్దకు చేరుకొని మంటలు ఆర్పారు. దుకాణంలో విద్యుత్ సరాఫరాను నియంత్రించే స్టెబిలైజర్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వచ్చినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనలో ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని యజమాని తెలిపారు.

పేదల బియ్యం.. పెద్దలదందా

● దేవరకొండ డివిజన్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా
● అధికారులు తనిఖీలు చేసినా ఆగని వైనం

దేవరకొండ డివిజన్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే సంబంధిత డీలర్లు, రేషన్‌కార్డు వినియోగదారులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నా అక్రమ రవాణా ఆగడంలేదు. పౌరసరఫరాలశాఖ, పోలీస్ అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమంగా రవాణా అవుతున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నా, బియ్యం అక్రమ రవాణా ఆగడంలేదు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు కారణం.

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

నిరుపేదల కోసం ప్రభుత్వం ఉన్నతమైన ఆశయంతో సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుంది. దేవరకొండ డివిజన్‌లోని మండలాల్లోని రేషన్ దుకాణాలకు ప్రధాన గోదాం నుంచి 115,22 క్వింటాళ్లు, 230 రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. కానీ కొంతమంది డీలర్లు వినియోగదారుల నుంచి బియ్యాన్ని కిలోకు రూ.15నుంచి రూ.16వరకు అందజేసి బియ్యాన్ని కొనుగోలు చేసి వ్యాపారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వ్యాపారులు, దళారులు రేషన్ బియ్యాన్ని మిల్లులకు తరలించి రూ.25 నుంచి 30వరకు విక్రయిస్తున్నారు. తాజాగా ఈ నెల 24న చింతపల్లి మండలం నసర్లపల్లి నుంచి వాహనంలో సంపతయ్య, మరియాబి, డ్రైవర్ శివలు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కల్వకుర్తికి తరలిస్తుండగా దేవరకొండ పట్టణ శివారులో సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి 20క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసి ముగ్గురుపై కేసు నమోదు చేశారు. సెప్టెంబరు 14న నాంపల్లి మండలం నర్సింహులగూడెం రైస్ మిల్లులో రేషన్ బియ్యం నిలువ ఉండడంతో డీటీసీఎస్ రఘునందన్ తనిఖీలు చేసి, 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని మిల్లును సీజ్ చేశారు.



దేవరకొండలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం(ఫైల్)



దేవరకొండలో గోదాంను తనిఖీ చేస్తున్న ఆర్డీవో రమణారెడ్డి (ఫైల్)

కేసులు నమోదు.. బియ్యం సీజ్ చేస్తున్నా..

దేవరకొండ డివిజన్‌లో చందంపేట, నేరేడుగొమ్ము, దేవరకొండ, పీఏపల్లి, చింతపల్లి, కొండమల్లేపల్లి, మండలాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. గతంలో దేవరకొండ మండలం ఎల్లారెడ్డిబావి వద్ద అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దేవరకొండ పోలీసులు పట్టుకున్నారు. దేవరకొండ మండలం తెలుగుపల్లిలో వినియోగదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ ఉంచిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దేవరకొండ పోలీసులు పట్టుకొని శ్రీను అనే వ్యాపారిపై కేసు నమోదు చేశారు. ఇద్దంపల్లి నుంచి బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 24 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. పౌరసరఫరాలశాఖ, టాస్క్‌ఫోర్స్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డిలు తనిఖీలు చేపడుతున్నా, అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. దేవరకొండ మండలానికి చెందిన కొంతమంది డీలర్లు బొలెరో వాహనాలను కొనుగోలుచేసి సొంత వాహనాల్లోనే బియ్యాన్ని నాగర్‌కర్నూల్, చారకొండ ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీస్, పౌరసరఫరాలశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పక్కదారిపట్టిస్తే కఠిన చర్యలు

రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తాం. రేషన్ డీలర్లు సన్నబియ్యాన్ని వినియోగదారులకు ఇవ్వాలి. అక్రమాలకు పాల్పడితే డీలర్‌షిప్ రద్దు చేస్తాం. వినియోగదారులు బియ్యాన్ని ఇతరులకు విక్రయిస్తే రేషన్‌కార్డులు రద్దుచేస్తాం. ఒకే వ్యక్తి రెండు సార్లు పట్టుబడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తాం.

ముబిన్, డీటీసీఎస్, దేవరకొండ

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. కేతేపల్లి మండలంలో ఒకరు, భువనగిరి మండలంలో ఇద్దరు సోమవారం మృత్యువాతపడ్డారు.

కేతేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం 65వ నెంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెలకాపరి, నాలుగు గొర్రెలు మృతి చెందాయి. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్)మండలం మిడతనపల్లి గ్రామానికి చెందిన బయ్య పాపయ్య(50) అదే గ్రామానికి చెందిన పరాల గంగయ్య, పరాల మహేష్‌తో కలిసి కొద్దిరోజుల క్రితం తమ గొర్రెల మందను తీసుకొని మేతకోసం నల్లగొండ జిల్లా కేంద్ర పరిసరాల్లోకి వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రి స్వగ్రామానికి బయలుదేరారు. కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం సమీపంలో కొన్ని గొర్రెలు హైవే మీదకు పరుగెత్తడంతో పాపయ్య వాటిని పక్కకు కొడుతుండగా అదే సమయంలో విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపు అతివేగంగా వెళుతున్న కారు గొర్రెలను, పాపయ్యను ఢీకొట్టి ముందుకు వెళ్లింది. దీంతో తీవ్రగాయాలైన పాపయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో పాపయ్యతోపాటు మరో నాలుగు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పాపయ్యను నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పాపయ్యకు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పాపయ్య కుమారుడు మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని కేతేపల్లి ఎస్‌ఐ సతీష్ వివరించారు. కాగా మృతుడు పాపయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.



ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు



బయ్య పాపయ్య (ఫైల్)



చెక్క రమేష్(ఫైల్)

యాదాద్రి భువనగిరి జిల్లాలో..

భువనగిరి టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భువనగిరిలో సోమవారం వేర్వేరు ఘటనలో ఇరువురు మహిళలు మృతి చెందారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎన్ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45-50 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని మహిళ మృతదేహం స్థానిక హైదరాబాద్ చౌరస్తా వద్ద లభించింది. మృతురాలు ఒంటిపై బూడిద రంగు చీర, గులాబీ రంగు జాకెట్టు ఉన్నాయి. మృత దేహాన్ని జిల్లా ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచారు. మరో ఘటనలో లక్ష్మీ (60) అనే మహిళ బస్టాండ్‌లో అనారోగ్యంతో ఉండడాన్ని గమనించి జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె ఒంటిపై పసుపు రంగు చీర, తెల్ల రంగు జాకెట్టు ఉంది. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలో భద్రపరిచారు. మృతదేహాల ఆచూకీ కోసం సెల్ నెంబర్లు ఎస్‌ఐ నరేశ్ సెల్:8712662491, పోలీస్ స్టేషన్ నెంబర్ సెల్:8712662803, ఎస్‌హెచ్‌వో సెల్:8712662471కు సంప్రదించాలని సూచించారు.

పాముకాటుకు గురై...

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన చెక్క రమేష్ (34) ఈ నెల 13న తన వ్యవసాయ పొలంలో పనిచేస్తుండగా, పాము కాటేసింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రమేష్ సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. రమేష్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రమేష్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. అతని భార్య ప్రస్తుతం గర్భిణిగా ఉంది. ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల గణేష్ ఆధ్వర్యంలో సభ్యులు రమేష్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూచిపూడి నృత్యంలో ఉచిత శిక్షణ


నల్లగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఉచితంగా అందించే కూచిపూడి నృత్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్యవైశ్య భవన్ అధ్యక్షులు భాస్కర్, నాంపల్లి భాగ్య కోరారు. నృత్యం నేర్చుకోవాలని తపన ఉండి, ఆర్థికంగా వెనుకబడిన వారు రామగిరిలోని కనకదుర్గ ఆలయ సమీపంలోని ఆర్యవైశ్య భవన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతీ ఆదివారం సాయంత్రం 5గంటల నుంచి 6.30గంటలకు శిక్షణ ఉంటుందన్నారు. 6వ, 7వ, 8వ తరగతి విద్యార్థులు హాజరుకావొచ్చని తెలిపారు.


శివలీలారెడ్డికి మదర్‌థెరిస్సా అవార్డు

కనగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన న్యూకంబాల శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శివలీలారెడ్డిని మదర్‌థెరిస్సా అవార్డు వరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని సత్తపల్లి పట్టణంలోని మస్తాన్ ఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మదర్ థెరిస్సా అవార్డును ప్రదానం చేశారు. శివలీలారెడ్డి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ సందర్భంగా శివలీలారెడ్డి మాట్లాడుతూ మదర్ థెరిస్సా అవార్డును అందుకోవటం ఆనందంగా ఉందన్నారు.

అనూషరెడ్డికి కన్నీటి వీడ్కోలు

● మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల నివాళి





అనూషరెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అయిలయ్య

గుండాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదంలో సజీవ దహనమైన మహేశ్వరం అనూషరెడ్డికి కన్నీటి వీడ్కోలు పలికారు. ఆదివారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వస్తాకొండూరుకు అనూషరెడ్డి మృతదేహాన్ని తీసుకొచ్చారు. అయితే ప్రమాదం జరిగిన తీరుతో అనూషరెడ్డి మృతదేహాన్ని గుర్తించడం కష్టమైంది. అనూషరెడ్డి తల్లిదండ్రులు విజిత, శ్రీనివాస్‌రెడ్డిల రక్త నమూనాలు తీసుకుని డీఎన్‌ఏ పరీక్ష చేసి అధికారులు అనూషరెడ్డి మృతదేహాన్ని గుర్తించి వస్తాకొండూరులోని బంధువులకు అప్పగించారు. అయితే సోమవారం అనూషరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. అల్లారు ముద్దుగా పెంచుకుతున్న తమ కుమార్తె మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఇదిలా ఉంటే అనూషరెడ్డికి తెలంగాణ ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఆ సొమ్ము పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

పరామర్శించిన మంత్రి, ఎంపీ

బస్సు ప్రమాదంలో మృతి చెందిన అనూషరెడ్డి కుటుంబాన్ని సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలు పరామర్శించారు. వస్తాకొండూరులోని అనూషరెడ్డి ఇంటికి చేరుకొని అనూషరెడ్డి తల్లిదండ్రులు విజిత, శ్రీనివాస్ రెడ్డిలకు ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా అనూషరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువకుడి నుంచి గంజాయి స్వాధీనం



గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భూదాన్‌పోచంపల్లిలో యువకుడి నుంచి పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముక్తాపూర్ గ్రామనివాసి మునుకుంట్ల శివకుమార్ బైక్‌పై గంజాయి తీసుకెళ్తుండగా సోమవారం పట్టుకున్నారు. అతని నుంచి 80 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎంపీవోకు త్రుటిలో తప్పిన ప్రమాదం

మర్రిగూడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండల ఎంపీవో రవికుమార్ కారును ఆర్టీసీ బస్సు ఢీకొనగా, త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మర్రిగూడ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. విధుల నిమిత్తం సోమవారం మర్రిగూడ మండలానికి సొంత కారులో వస్తుండగా ప్రమాదవశాత్తు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో సూపర్ డీలక్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఘటనలో కారు బోల్తా పడినప్పటికీ కారు డ్రైవింగ్ చేస్తున్న తనకు ఎలాంటి ప్రమాదం జరగలేదని, స్వల్ప గాయాలతో బయటపడడం వల్ల తృటిలో పెను ప్రమాదం తప్పినట్లు ఎంపీవో తెలిపారు. స్వల్ప గాయాలతో విధులకు హాజరైన ఎంపీవోను వివిధ శాఖలకు చెందిన అధికారులు పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

యాద'గిరి'పై కార్తీక దీపోత్సవం



యాదగిరిగుట్ట: శివాలయ ప్రాంగణంలో దీపోత్సవంలో అధికారులు, భక్తులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్య క్షేత్రంలో కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో శివాలయ ప్రాంగణంలో అధిక సంఖ్యలో మహిళ భక్తులు కార్తీక దిపోత్సవం నిర్వహించి, మొక్కులు చెల్లించారు. దేవాదాయ శాఖ అనుమతితో ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అధికారులు నిర్వహించారు. భక్తుల్లో ఆధ్యాత్మికతను, సంప్రదాయాలను ప్రోత్సహించే లక్ష్యంతో దేవస్థానం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. కాగా ప్రధానాలయంలో నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. శివాలయంలో అభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి డీఈవో జూసెట్టి కృష్ణ, ఏఈవో గజ్వేల్ రఘు, ప్రధాన అర్చకుడు బట్టర్ సురేంద్ర చార్యులు బృందం, పర్యవేక్షకుడు సీతారామాచార్యులు పాల్గొన్నారు.

ఆళ్వార్లకు పురప్పాట్టు సేవ : లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం మనవాళ మహాముని తిరునక్షత్రోత్సవాలు పండితులు వైభవంగా నిర్వహించారు. ఆళ్వార్లలకు పురప్పాట్టు సేవ చేస్తూ ప్రబంధ పాశురాలను పఠనంతో మాడవీధుల్లో ఊరేగించారు. కలెక్టర్ హనుమంతరావు, ఇన్‌చార్జి డీఈవో జూశెట్టి కృష్ణ, ఏఈవో గజ్వేల్ రఘు, పర్యవేక్షకుడు సీతారామాచార్యులు బృందం, ప్రధాన అర్చకుడు బట్టర్ సురేంద్రాచార్యులు పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహుని క్షేత్రంలో నిత్య కల్యాణం వైభవంగా నిర్వమించారు. కార్తీక సోమవారం కావడంతో శివాలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి.

భూనిర్వాసితుల గోడు పట్టదా?



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాతీయ రహదారి-930 భూనిర్వాసితులు (ఫైల్)

- ఆందోళనలో గౌరెల్లి-భద్రాచలం జాతీయ రహదారి నిర్వాసితులు
- బాధితులకు అందని పరిహారం

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలో భూ నిర్వాసితుల గోడు పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో పరిహారం కోసం వారు ఏళ్ల తరబడి ఎదురు చూస్తూనే ఉన్నారు. గౌరెల్లి - భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారి-930 యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాల మీదుగా వెళుతోంది. ఈ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులు, రైతులకు ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించలేదు. ఎంతో కాలంగా నిర్వాసితులు అధికారులను కలిసి విన్నవించుకున్నా వారి మొర ఆలకించడంలేదని నిర్వాసితులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. భూములు కోల్పోతున్న రైతులకు 'బుక్ వాల్యూ' ప్రకారం కాకుండా బహిరంగ మార్కెట్ వాల్యూ ప్రకారం రేటు చెల్లించాలని గౌరెల్లి-భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారి భూనిర్వాసితుల కమిటీ తరఫున ఇప్పటికే కలెక్టర్‌తోపాటు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అనేకసార్లు సమావేశాలు నిర్వహించినా, సమస్య పరిష్కరించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరిసాగుపై ఆధారం

జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాల నుంచి మూసీ ప్రవహిస్తుండడంతో ఆ నీటిని ఆధారం చేసుకుని ఆయకట్టులోని రైతాంగం పూర్తిగా వరి సాగుపై ఆధారపడింది. బహిరంగ మార్కెట్లో ఈ ప్రాంతంలో భూమి ధర ఎకరం రూ.1కోటి 20 లక్షల నుండి రూ. 3కోట్ల వరకు పలుకుతుందని నిర్వాసితులు పేర్కొంటున్నారు. ఇలాంటి అతి ఖరీదైన భూములను రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ చేసిన ప్రభుత్వం ఎకరం రూ.24 లక్షలు మాత్రమే ఇస్తామనడం వల్ల నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరతరాలుగా సాగుచేసుకుంటున్న రైతుల వ్యవసాయ భూములను జాతీయ రహదారి నిర్మాణం కోసం శాశ్వతంగా ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందని బాధితులు తమ గోడు వినిపిస్తున్నారు. రోడ్డు నిర్మాణం కోసం వందల కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్న కేంద్ర ప్రభుత్వం భూనిర్వాసితులకు నష్టపరిహారం కోసం ఎందుకు ఖర్చు పెట్టదని వారు ప్రశ్నిస్తున్నారు. బహిరంగ మార్కెట్ ప్రకారం రేటు చెల్లించకపోతే భూమికి - భూమి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.


ఎనిమిది ఎకరాల సాగుభూమిని కోల్పోతున్నా



గౌరెల్లి-భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారి నిర్మాణంలో మా భూమి నుంచి అధికంగా 8 ఎకరాల మేరకు భూమిని కోల్పోతున్నా. ప్రభుత్వం బహిరంగ మార్కెట్ ధర ప్రకారం చెల్లించాలి. కనీసం ఎకరా రూ. 40 లక్షలు తగ్గకుండా చెల్లించాలి.

- శేఖర్‌రెడ్డి, భూనిర్వాసితుడు, దంతూరు

నష్టపరిహారం వెంటనే చెల్లించాలి



భూదాన్‌పోచంపల్లి మండలం కనుముకుల గ్రామానికి చెందిన నా కుటుంబ సభ్యులకు సంబంధించిన మొత్తం 3 ఎకరాల 21 గుంటల భూమిని కోల్పోతున్నాం. ఇందుకు ప్రభుత్వం ఎకరాకు అతి తక్కువగా రూ.24 లక్షలు మాత్రమే చెల్లిస్తామని ప్రకటించింది. అయితే బహిరంగ మార్కెట్ ధర చొప్పున ఎకరాకు 60 లక్షలు కనీసం చెల్లించాలి. ప్రభుత్వం అందించే అరకొర సాయం ఇప్పటికీ అందలేదు.

- భూపాల్‌రెడ్డి, కనుముకుల, భూనిర్వాసిత రైతు

భూసేకరణ చేసి..

రంగారెడ్డి జిల్లా గౌరెల్లి నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలోని పిలాయిపల్లి, జగత్‌పల్లి, జూలూరు, పోచంపల్లి, మెహర్‌నగర్, భీమనపల్లి, కనుముకుల, దంతూరు, వంకమామిడి, ధర్మారెడ్డిపల్లి, సంగెం, పొద్దుటూరు, రెడ్ల రేపాక, లోతుకుంట గ్రామాల్లో భూసేకరణ చేపట్టిన ప్రభుత్వం 15 గ్రామాల్లో 455 ఎకరాల భూసేకరణ చేసింది. 42 కిలోమీటర్ల పొడవున జిల్లా మీదుగా జాతీయ రహదారి నిర్మాణం చేపట్టనుంది. భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లిలో 30-02 ఎకరాలు, జగత్‌పల్లిలో 10-06 1/2, పోచంపల్లిలో 53-19, జూలూరులో 15-39 1/2, భీమనపల్లిలో 23-07, మెహర్‌నగర్‌లో 8-07 1/2, కనుముకులలో 26-01 1/2, దంతూరులో 25-05, వంకమామిడిలో 20-26, ధర్మారెడ్డిపల్లిలో 16-14 ఎకరాల చొప్పున మొత్తం 229.08 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ప్రభుత్వం బహిరంగ మార్కెట్ రేటులో సగం ధరనైనా కట్టించాలని బాధితులు వేడుకుంటున్నారు. ఇప్పటి వరకు భూనిర్వాసితులకు పరిహారం అందలేదు. ఇప్పటికైనా సత్వరమే భూనిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సిందిగా కోరుతున్నారు.

14 ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగాలకు 353 దరఖాస్తులు

- నేటి నుంచి దరఖాస్తుల పరిశీలన
- నవంబరు 10న ఫైనల్ మెరిట్ లిస్టు



దరఖాస్తులు చేసుకుంటున్న అభ్యర్థులు

భువనగిరి (కలెక్టరేట్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఖాళీగా ఉన్న 14 మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) ఉద్యోగాలకు అభ్యర్థులు సోమవారం భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్, స్టాఫ్ నర్స్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం అర్హతతో కమ్యూనిటీ హెల్త్‌లో ఆరు నెలల బ్రిడ్జి కోర్సు చేసిన వారికి అర్హత కల్పిస్తూ ఈ నెల 23 నుంచి 27 వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఖాళీగా ఉన్న 14 పోస్టులకు గాను దరఖాస్తుల స్వీకరణ ముగింపు సమయానికి సుమారు 353 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను నేటి నుంచి ఈ నెల 31 వరకు పరిశీలించి, నవంబరు 1 నుంచి 4వ తేదీ వరకు ప్రొవిజినల్ మెరిట్ లిస్టు ప్రదర్శించడంతో పాటు అభ్యంతరాలు, ఆక్షేపణలు స్వీకరించనున్నారు. నవంబరు 10న ఫైనల్ మెరిట్ లిస్టును ప్రదర్శించి సర్టిఫికెట్ పరిశీలన కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు.

ఆ ముగ్గురు నేతలపై కేసు నమోదుచేయాలి



యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పదేళ్లపాటు తెలంగాణను దోచుకున్న బీఆర్‌ఎస్ నేతలు తన్నీరు హరీ‌ష్‌రావు, సంతో‌ష్‌రావు, నవీన్‌రావులపై కేసు నమోదుచేసి విచారణ చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కోరారు. సోమవారం ఈ మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో సీఐ బొడ్డుపల్లి భాస్కర్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్‌ను తప్పుదోవ పట్టించి 10సంవత్సరాలు తెలంగాణను దోచుకున్న ఆ ముగ్గురు నేతలపై కేసు నమోదు చేయాలన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు నోరు మెదపని కవిత అధికారం పోయిన తరువాత వారి కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. హరీ‌ష్‌రావు, సంతో‌ష్‌రావు, నవీన్‌రావులు కలిసి సంపదను దోచుకున్నారని ఆమె చేసిన ఆరోపణలపై బీఎన్ఎస్ యాక్టు 173 ద్వారా విచారణ జరిపించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకముందు రాష్ట్రం మిగులు బడ్జెట్‌తో ఉండేదన్నారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సంపదను దోచుకున్న బీఆర్ఎస్ నాయకులు రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనపై చిల్లర ఆరోపణలు చేయడం అవివేకమని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించినప్పటికీ బుద్ధిరాలేదని, త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎవరి సత్తా ఏమిటో ప్రజలే నిర్ణయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అన్నం సంజీవరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అయినాల చైతన్యమహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మండల పట్టణ అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, బందారపు భిక్షపతిగౌడ్, మాజీ కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణిభరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేష్, హేమేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పునాదులకే పరిమితం



పునాది దశలోనే ఉన్న చింతలపాలెంట తహసీల్దార్ కార్యాలయం

- ప్రజాధనం వృథా
- అడుగు ముందుకు పడని ప్రభుత్వ భవన నిర్మాణాలు

చింతలపాలెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలో ప్రభుత్వ భవనాల పనులు పునాది దశలోనే నిలిచిపోయాయి. మండలాల పునర్విభజనలో భాగంగా చింతలపాలెం కొత్త మండలంగా ఏర్పడింది. ఈ కొత్త మండలానికి వివిధ ప్రభుత్వ కార్యాలయాలు అవసరం కావడంతో అప్పటికప్పుడు తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్, వ్యవసాయ శాఖల భవనాలు అద్దెకు తీసుకొని ఆ భవనాల్లోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నా రు. ఆ గదులు ఇరుకుగా ఉండటంతో కూర్చునేందుకు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు ఆరుబటయ ఎండా, వానకు తడుచుకుం టూ నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ భవనాకు నెలకు రూ. వేలల్లో అద్దె చెల్లిస్తున్న రికార్డులు భద్రపర్చేందుకు సరైన స్థలం లేదు. కొన్నిచోట్ల మూత్రశాలలు లేక సిబ్బంది అవస్థ లు పడుతున్నారు. అతికష్టం మీద అధికారులు, సిబ్బంది కాలం వెల్లదీస్తున్నారు. దీంతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండ ల అభివృద్ధిని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇందులో భాగంగా మండలానికి సొంత భవనాలు కేటాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ కార్యాలయాలైన తహసీల్దార్ కార్యాలయం రూ.2.60 కోట్లు, ఎంపీడీవో కార్యాలయానికి రూ.2.98కోట్లు, పోలీస్‌స్టేషన్‌కు రూ.2.38 కోట్లు మంజూరుచేసి, శంకుస్థాపన శిలాఫలకం వేసి ఏడాదికాలం పూర్తవుతున్నా పునాది స్థాయిలోనే ఈ భవనాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కాంట్రాక్టర్లు టెండ ర్ల ద్వారా కాంట్రాక్టును దక్కించుకున్న నిర్మాణ పనులు చేయడంలో విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతం జిల్లా కేంద్రానికి సుమారు 80 కిలోమీటర్ల దూరం ఉండటంతో ఇటువైపు ఆ శాఖకు సంబంధించిన రోడ్లు, భవనాల శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయంపై తక్షణమే దృష్టి సారించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గతేడాది నవంబర్‌లో శంకుస్థాపన

చింతలపాలెం మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గతేడాది నవంబరులో శంకుస్థాపన చేశారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కార్యాలయాల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో ఇప్పుడు ఉన్న అద్దె భవనాల్లోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పనులు వేగంగా అయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



మండలంలో ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పనుల్లో జాప్యం లేకుండా, ప్రజాధనం వృథా కాకుండా చూసుకోవాలి.

- ఉసిరికాయల వెంకట్‌గౌడ్, చింతలపాలెం.

కూలీల కొరత..వర్షాలతో వెత



చందంపేట మండలం సంధ్యతండాలో పత్తిచేలో పత్తి తీస్తున్న కూలీలు

గుర్రంపోడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను కూలీల కొరత వేధిస్తోంది. పంట చేతికొచ్చే దశలో కూలీలు దొరక్కపోవడంతో రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఓ పక్క కురుస్తున్న వర్షాలతో కుదేలవుతుంటే మరోపక్క కూలీలు దొరక్క నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రతీ రోజు రైతులు కూలీల చుట్టూ తిరుగుతున్న వచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. తరుచూ వర్షాలు కురుస్తుండడంతో పత్తి కిందపడి పంట చేలోనే మొలకెత్తుతోంది. మండలంలో 38 గ్రామపంచాయతీలుండగా, వాటిలో ఎనిమిది ఏఈవోలకు క్లస్టర్లు ఉన్నాయి. మండల పరిధిలోని 41,250 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. పత్తి చేతికందే సమయంలో వర్షాలురావడంతో పత్తి నల్లబారి కిందపడే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. కూలీల కొరత ఉండడంతో ఒక్కొక్కరికి రూ.400 చెల్లించినా కూలీలు దొరకడంలేదు. కిలో పత్తితీస్తే రూ.12నుంచి రూ.18 వరకు చెల్లిస్తున్నట్టు రైతులు పేర్కొంటున్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలు నేటికీ ప్రారంభించలేదు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నా నేటికీ కేంద్రాలు తెరుచుకోలేదు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

చందంపేట మండలంలో..

చందంపేట: అధిక వర్షాలతో పత్తి రైతులు ఇబ్బందులుపడుతున్నారు. గత రోజులుగా కురుస్తున్న ఆగని వర్షాలతో పత్తి రైతులకు ఎదురు దెబ్బ తగిలింది. పత్తిచేలు నీటిలో మునిగి చాలా చోట్ల పత్తి కిందరాలి తడిసి పోయింది. ఇప్పటికే రైతులు ఎకరానికి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ కూలీల ఖర్చులతో రూ.18వేల నుంచి రూ. 20వేల వరకు ఖర్చు చేశారు. అధిక పెట్టుబడితో రైతులు కుదేలవుతున్నారు. దానికితోడు పత్తి తీయడానికి కూలీల ఖర్చు రోజుకు రూ.400 నుంచి 500 డిమాండ్ చేస్తున్నారు. అయినా కూలీలు దొరకడంలేదు. కూలీలు తీసే పత్తికి కిలోకు రూ. 16 నుంచి రూ.20 డిమాండ్ చేస్తున్నారు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితులలో కూలీల డిమాండ్లకు తలొగ్గినా తీసిన పత్తికి తేమశాతం అధికంగా ఉండడంతో మార్కెట్ ధర కూడా రావడంలేదు. దళారులు రూ.6వేల నుంచి రూ.7వేల వరకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడంతో రైతులపై మరింత భారంపడింది.

నీరు నిల్వకుండా చూడాలి

వర్షాల కారణంగా పత్తి, పొలాల్లో నీరు నిల్వకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. బాగా ఎండ ఉన్నప్పుడే పత్తి తీసుకోవాలి. తేమశాతం ఎక్కువగా ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రాదు.

ఏవో కంచర్ల మాధవరెడ్డి, గుర్రంపోడు

పెట్టుబడులు వచ్చే పరిస్థితిలేదు



నాకున్న రెండు ఎకరాలతో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. ఒక ఎకరానికి దాదాపు రూ.18వేల నుంచి 20వేల వరకు అయింది. పత్తిదిగుబడి బాగానే ఉన్నప్పటికీ అధిక వర్షాలు, కూలీల కొరతతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితిలేదు. తక్షణమే ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కనీసం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8వేలు అందజేయాలి.

- కేతావత్ బిచ్చా, సంధ్యతండా

ప్రభుత్వం ఆదుకోవాలి



ఆరు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. దాదాపు రూ.1.60లక్షల వరకు ఖర్చయింది. పత్తిపంట తీసేందుకు కూలీల కొరత తీవ్రంగా ఉంది. పంట చేతికందే సమయంలో వర్షాలు రావడంతో పంట మొలకెత్తి నష్టపోతున్నాం. వర్షాల కారణంగా పత్తి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఐతరాజు కృష్ణయ్య, రైతు, కొప్పోలు

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి



అధ్యాపకులకు సూచనలిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీంసింగ్

నార్కట్‌పల్లి, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను 90 రోజుల ప్రణాళిక మేరకు వచ్చే వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీంసింగ్ అన్నారు. నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉద్దేశించిన 90 రోజుల పాఠ్య ప్రణాళిక అమలుతీరును ప్రిన్సిపాల్, అధ్యాపకుల ద్వారా పరిశీలించారు. వచ్చే ఏడాదిలో జరిగే జేఈఈ, ఎప్‌సెట్, నీట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలని సూచించారు. విద్యార్థుల ఎఫ్‌ఆర్ఎస్ హాజరు శాతాన్ని 28 నుంచి 31 శాతానికి పెంచినట్లు తెలిపారు. కాగా కళాశాలకు కావల్సిన కొన్ని మౌలిక వసతులు, ఇతర సమస్యలను జాయింట్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో కాలేజీ ప్రిన్సిపాల్ బాలాజీ, అధ్యాపకులు సిబ్బంది ఉన్నారు.

'విజ్ఞాన్' ప్రోగ్రామ్‌లకు ఎన్‌బీఏ టైర్-1 గుర్తింపు



వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ నాగభూషణ్

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యాసంస్థలకు జాతీయ స్థాయిలో నాణ్యత ప్రమాణాలను నిర్ధారించే నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ (ఎన్‌బీఏ) నుంచి విజ్ఞాన్ యూనివర్సిటీలో అర్హత కలిగిన అన్ని ప్రోగ్రామ్స్‌కు టైర్-1 అక్రెడిటేషన్ లభించిందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వైస్ ఛాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్ మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్సిటీ మొదటి నుంచి విద్యా నాణ్యత, పరిశోధనలో ప్రతిభ, సామాజిక బాధ్య త అంశాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. అర్హత కలిగిన అన్ని ప్రోగ్రామ్స్‌కు ఎన్‌బీఏ టైర్-1 అక్రెడిటేషన్ పొందడం ద్వారా విజ్ఞాన్ విద్యా ప్రమాణాలకు, బోధనా నాణ్యతకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌బీఏ తనిఖీ బృందం 2025 ఆగస్టు 29 నుంచి మూడు రోజులపాటు విజ్ఞాన్ యూనివర్సిటీని సందర్శించిందని తెలిపారు.

నార్కట్‌పల్లి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషిస్తూ అసభ్యకరమైన మాటలు మాట్లాడిన నార్కట్‌పల్లి ఎస్ఐపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని నార్కట్‌పల్లి మండల పరిధిలోని ఔరవాణి గ్రామానికి చెందిన ముప్పిడి మారయ్య పోలీస్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌డేలో ఎస్పీ శరత్ చంద్రపవార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల భూమి సమస్యలతో పోలీస్‌స్టేషన్ సంప్రదించగా ఎస్సీ కులానికి చెందిన నన్ను కులం పేరుతో దూషిస్తూ సీనియర్ సిటిజన్ అని కూడా చూడకుండా ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా మాట్లాడి మానసిక ఒత్తిడికి గురిచేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థకు మచ్చ తెస్తున్న ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని నార్కట్‌పల్లి సీఐకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని అందుకే డీఎస్పీకి, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంటనే పోలీస్ అధికారులు ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మునుగోడురూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో పద్మజ అన్నారు. మండలంలోని సింగారం, జమస్థాన్‌పల్లి గ్రామాల్లో సోమవారం ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవో చైర్మన్ స్వామి గౌడ్, ఎఫ్‌పీవో ఆర్గనైజేషన్ ఆఫీసర్ శివశంకర్, మార్కెట్ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి, నాయకులు పంతంగి పద్మస్వామి, ఏఈవో నర్సింహ, జానారెడ్డి పాల్గొన్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

శాలిగౌరారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాబోయే రెండు రోజులు తుఫాన్ ప్రభావం వలన శాలిగౌరారం మండలంలో తీవ్రమైన వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బిట్ల వరప్రసాద్ కోరారు. లోతట్టు ప్రాంతాలు, పాత ఇళ్లల్లో ఉండేవారు, కరెంట్ స్తంభాల వద్దకు ఇతరత్రా ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాగే రైతులు ధాన్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వ ప్రాధాన్యం

● *డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి*



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

చిట్యాలరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ప్రాధాన్యమిస్తుందని డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉరుమడ్లకు చెందిన సాగర్ల భిక్షం, జాల గోపాల్, జాల మల్లేష్, మాదగోని నాగయ్య, మాదగోని లింగస్వామితో పాటు పలువురు బీఆర్ఎస్‌ను వీడి సోమవారం హైదరాబాద్‌లో అమిత్‌రెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి ఆయన కండువాల కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ప్రతీ ఒక్కరూ పార్టీ అభ్యున్నతికి పాటుపడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తా దేవేందర్‌రెడ్డి, కోనేటి యాదగిరి, చెరుకు సైదులు, పోలగోని స్వామి, ఉయ్యాల లింగయ్య, పట్ల జనార్ధన్, జన్నపాల శ్రీను, పాకాల దినేష్, కురుపటి లింగయ్య, అంతటి నాగరాజు, శ్రీను, నరేష్, గోపాల్, భిక్షం, యాదయ్య, జెన్నారెడ్డి, వెంకన్న, లింగయ్య, కిరణ్, నాగేష్, నాగరాజు, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌ను ఇళ్ల మధ్య నుంచి తరలించాలి



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మహిళలు

చిట్యాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చిట్యాల పట్టణంలోని 10వ వార్డులో ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన పోస్టాఫీస్‌ను తరలించాలని స్థానిక మహిళలు మునిసిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. పోస్టాఫీస్‌కు పింఛన్ కోసం వస్తున్న వృద్ధులు, దివ్యాంగులు నివాస గృహాల ముందే ఉమ్మి వేయడం, మూత్ర విసర్జన చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాక ఇళ్ల మధ్యలో కంపచెట్లు పెరగడం వల్ల దోమలు, పందులు పెరిగి పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయని తెలిపారు. పారిశుధ్య చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు జామండ్ల కవిత, మండడి కృష్ణవేణి, మండడి హేమలత, గంటల రజిత, కుకుడపు లక్ష్మి, సిలివేరు లక్ష్మి, మమత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలపై సర్వే చేయాలి



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వాడపల్లి నవీన్

నార్కట్‌పల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో గల సోమసముద్రం చెరువు ఆక్రమణకు గురైందని సర్వే నిర్వహించి చెరువు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని బీఆర్ఎస్వీ నాయకుడు వాడపల్లి నవీన్ కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో అద నపు కలెక్టర్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ చెరువుకు సమీపంలోని పట్టా భూమిలో రియల్ ఎస్టేట్ వెంచర్ చేసిన వ్యాపారులు చెరువుకు సంబంధించిన శిఖం భూమిని కబ్జా చేసి కడీలు పాతుతున్నారని ఆరోపించారు. తక్షణమే విచారణ జరిపించి ఆక్రమించుకున్న భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కపాస్‌పై రైతులకు అవగాహన



నెమ్మానిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో గౌతమ్

నార్కట్‌పల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పత్తిని విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కపాస్ యాప్‌పై వ్యవసాయాధికారి గౌతమ్ సోమవారం అవగాహన కల్పించారు. మండలంలోని నెమ్మానిలో రైతులను కలిసి కపాస్ యాప్‌ను ఎలా వినియోగించడాన్ని వివరించారు. యాప్‌లో నమోదు చేయకుంటే పత్తిని సీసీఐ కొనుగోలు చేయదని సూచించారు. ఒకవేళ ఎవరైనా మొబైల్ ఫోన్‌నెంబర్ మారితే సంబంధిత ఏఈవోలను సంప్రదించాలని ఏవో సూచించారు. కపాస్ యాప్‌పై మంగళవారం ఉదయం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతాధికారులు మరింత అవగాహన కల్పిస్తారని నార్కట్‌పల్లిలోని రైతువేదికలో జరిగే ఈ సమావేశానికి రైతులు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏఈవో విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి కట్టుమిషన్ అందజేత



స్వప్నకు కుట్టుమిషన్ అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు, గీత కార్మిక సంఘం నాయకులు

శాలిగౌరారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు నేతాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు, కల్లు గీత కార్మికుడు బండారు మహేష్ ఇటీవల రైలు కిందపడి మృతి చెందాడు. అతని భార్య బండారు స్వప్నకు కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్నగౌడ్, సహాయ కార్యదర్శి రాజ్ కొండ వెంకన్న, ఫౌండేషన్ ప్రతినిధులు నాతి గణేష్, బాల్నే రామచంద్రు, బల్గురు వెంకట్, ఉప్పల గోపాల్, నకిరేకల్ కల్లు గీత సంఘం అధ్యక్షుడు కొప్పుల అంజయ్య, ప్రధాన కార్యదర్శి గుడుగుంట్ల బుచ్చిరాములు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నాం... ఆదుకోండి

'ప్రజావాణి'లో వినతుల వెల్లువ



బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నాం ఆదుకోండి అంటూ... జిల్లా నలుమూలల నుంచి అనేక మంది బాధితులు ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి వారం వారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా కార్యక్రమానికి హాజరయ్యారు. వారిలో కొందరు వ్యక్తిగత సమస్యలపై తరలిరాగా మరికొందరు సామాజిక అంశాలపై వచ్చారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అందుబాటులో లేకపోవడంతో జిల్లా అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ఇతర అధికారులతో కలిసి బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు లేఖలు రాశారు.

రిలీవ్ ఆర్డర్ ఇప్పించండి



నేను 2023 నుంచి నాగార్జున సాగర్ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ల్యాబ్ అటెండెంట్‌గా పనిచేస్తున్నాను. ఇటీవల నన్ను డిపూటేషన్ పేరుతో హైదరాబాద్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్కడికి వెళ్లి జాయిన్ అయ్యాను. ఐదు రోజులు పాటు విధులు కూడా నిర్వహించాను. ఆ తర్వాత నన్ను రిలీవ్ చేస్తున్నామంటూ తిరిగి సాగర్‌కు పంపించారు. ఐదు నెలలవుతున్నా ఇప్పటివరకు కూడా నాకు రిలీవ్ ఆర్డర్ ఇవ్వడం లేదు. చివరకు ఉన్నతాధికారులను సంప్రదించగా డిప్యూటేషన్ లిస్టులో నీ పేరు లేదంటూ చెబుతున్నారు. దయచేసి న్యాయం చేయండి.

- దుర్గాప్రసాద్, నాగార్జునసాగర్

పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇప్పించండి



మేముగత 15 సంవత్సరాలుగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో మండల కంప్యూటర్ సెంటర్ నందు అటెండర్లుగా పనిచేస్తున్నాను. చాలీచాలని వేతనాలతో కేవలం రూ. 5200ల వేతనంతో మాత్రమే కుటుంబాలను పోషించుకుంటూ వస్తున్నాము. అయితే గడిచిన ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాను. దయచేసి పెండింగ్‌లో ఉన్న వేతనాన్ని ఇప్పించి ఆదుకోండి.

- ఉపాధిహామీ, అటెండెంట్లు

పాఠశాలను ఏర్పాటు చేయాలి



మా కాలనీలో సుమారు 2 వేల కుటుంబాలు నివసిస్తున్నాయి. వీళ్ల ఎక్కువ శాతం మంది పేద మధ్య తరగతి కుటుంబానికి సంబంధించిన వారే ఉన్నారు. అయితే మా కాలనీ పరిసర ప్రాంతాల్లో సుమారు రెండు కిలోమీటర్ల వరకు ప్రభుత్వ పాఠశాల లేదు. దీంతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన చిన్నారులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. వెంటనే పాఠశాల ను ఏర్పాటు చేసి పిల్లలకు విద్యనందించాలి.

- ఇందిరమ్మ కాలనీవాసులు, మిర్యాలగూడ

ఆలయాల్లో కార్తీక తొలి సోమవారం పూజలు



నల్లగొండ ఛాయా సోమేశ్వరాలయం వద్ద భక్తుల సందడి

నల్లగొండకల్చరల్, కేతేపల్లి, నార్కట్‌పల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం జిల్లాలోని పలు శివాలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. ఈ సందర్భంగా భక్తులు వేకువజాము నుంచే శివాలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు.

● నల్లగొండ పట్టణంలోని తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో రాత్రి 7 గంటలకు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్తంగా, వేదమంత్రోచ్చారణ మధ్య స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించి పరవశించిపోయారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఉదయం శివాలయంలో రుద్రాభిషేకాలు, జ్ఞాన సరస్వతీ అమ్మవారికి అభిషేకాలు, అర్చనల వంటి పూజలు నిర్వహించారు. అదే విధంగా పానగల్లులోని ఛాయా సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివలింగానికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. కొనేరులో దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు. దీంతో ఆలయమంతా భక్తులతో సందడిగా మారింది. అదేవిధంగా పట్టణంలోని వీటీకాలనీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, షేర్ బంగ్లా సంతోషిమాత దేవాలయం, పచ్చల సోమేశ్వరస్వామి దేవాలయంలో మొదటి సోమవారం కార్తీక మాసం పూజలు ఘనంగా జరిగాయి.

● కేతేపల్లి మండలంలోని ఇనుపాముల పచ్చలపార్వతీ సోమేశ్వరాలయం, కేతేపల్లి, తుంగతుర్తి, భీమారం, కాసనగోడు గ్రామాల్లోని శివాలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యాన ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇనుపాముల శివాలయానికి స్థానికులతో పాటు నకిరేకల్ పట్టణం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

● నార్కట్‌పల్లి మండలంలోని పలు శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం, గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంపై గల పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయం, నార్కట్‌పల్లిలోని బస్టాండ్ వెనక ఉన్న శివాలయం, మాండ్ర దారిలో ఉన్న రామలింగేశ్వర ఆలయం, అక్కెనపల్లిలో ఉన్న బహ్మసూత్రం గల శివాలయంలో కార్తీక మాస ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిగాయి. మండలంలోని అమ్మనబోలులో ఆర్యవైశ్యులు కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఛాయా సోమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కేతేపల్లి : పూజల్లో పాల్గొన్న మహిళలు

మూడో 'సారీ'

● *కనీస ధర రాని ఎల్లారెడ్డిగూడెం కొబ్బరికాయల విక్రయవేలం*

● *గత అనుభవాలతో పెంచని టెండర్‌దారులు*

● *రింగ్ అవడంతో పెరగని టెండర్ ధర?*



ఎల్లారెడ్డిగూడెంలో కొబ్బరికాయల విక్రయ వేలం నిర్వహిస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యాభై లక్షలకు పైగా పలకాల్సిన కొబ్బరికాయల విక్రయ వేలం ధర ముచ్చటగా మూడోసారి నిర్వహించినా కూడా ముప్పై లక్షలు దాటలేదు. గత అనుభవాలతోనే ఎక్కువ మొత్తంలో టెండర్ పాడలేదని టెండర్‌దారులు చెబుతుండగా టెండర్‌దారులు రింగు కావడంతోనే కనీ స ధర కూడా రాలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాది కాలపరిమితికి గాను తమ గ్రామ పంచాయతీ పరిధిలో కొబ్బరికాయల విక్రయవేలం హక్కు ఇచ్చేందుకు మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించారు. గతంలో రెండు పర్యాయాలు నిర్వహించిన ఈ బహిరంగ వేలానికి రెండు పర్యాయాలు కేవలం ఇద్దరు టెండరు దారులు మాత్రమే పాల్గొనగా కేవలం రూ. 20.10లక్షలకే అత్యధిక పాట మాత్రమే పాడారు. అధికారులు నిర్ణయించిన కనీస ధర రూ.53 లక్షల ధర రాకపోవడంతో వేలం నిబంధనల ప్రకారం వాయిదా వేశారు. సోమవారం మూడోసారి నిర్వహించిన వేలంపాటలో నలుగురు వేలందారులు పాల్గొన్నారు. గత అనుభవాల దృష్ట్యా వేలం పాటను చిక్కుళ్ల శివ అనే వ్యక్తి అత్యధిక పాట రూ.30లక్షలకు మాత్రమే పాడాడు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో సుధాకర్ పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

కలెక్టర్ ఆమోదిస్తేనే : వేలం నిబంధనల ప్రకారం మూడు పర్యాయాలు వేలంపాట నిర్వహించాం. తమ ఉన్నతాధికారులు నిర్ణయించిన కనీస ధర రూ.53లక్షలు కాగా మూడోసారి కూడా రూ.30లక్షలకు మించి రాలేదు. మూడు సార్లు పెట్టినా కనీస ధర రానందున టెండర్ ఆమోదం కోసం డీపీవో ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పంచాయతీ కార్యదర్శి వెంకన్న తెలిపారు.

టెండరుదారుల రింగ్?

టెండర్‌దారులు రింగ్ అయినందునే కొబ్బరికాయల విక్రయ వేలం ధర పెరగలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర రూ.53లక్షలు ఉండగా టెండర్‌దారులు రింగ్ అయి ధర పెంచలేదనే గ్రామస్థులు విమర్శిస్తున్నారు. అయితే గతంలో ఎక్కువ మొత్తానికి టెండర్ పాడి తీసుకున్న వ్యక్తులు నష్టపోయారని, అందుకే ఎక్కువ పాడలేదనే వాదన కూడా వినవచ్చింది.

యాప్‌తో సంబంధం లేకుండా పత్తి కొనుగోలు చేయాలి

● *రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాళ ప్రమీల*

నకిరేకల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కపాస్ కిసాన్ యాప్‌తో సంబంధం లేకుండా పత్తి కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాళ ప్రమీల డిమాండ్ చేశారు. నకిరేకల్ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్‌యాప్‌తో పత్తి రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడినందున వెంటనే కపాస్ కిసాన్‌యాప్‌ను రద్దు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న రైతులకు స్మార్ట్‌ఫోన్‌లు లేవని, వారికి కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన లేనందున టోకెన్ల ద్వారా పత్తి కొనుగోలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

పత్తి క్వింటా ఒక్కంటికి రూ.10075 లతో కొనుగోలు చేయాలని, 24 గంటలలోపు రైతుల ఖాతాలో డబ్బులు జమయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు వెంకట్, వంటిపాక వెంకటేశ్వర్లు, చెన్నబోయిన నాగమణి, వంటిపాక కృష్ణ, గురిజ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ హౌస్‌తో విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ శంకర్

తిప్పర్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించవచ్చని తిప్పర్తి ఎస్ఐ వి.శంకర్ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం తిప్పర్తి మండల పరిధిలోని మోడల్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు ఎస్ఐ బహుమతులను అందజేశారు. అనంతరం 9, 10 తరగతుల విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల పనితీరు, ప్రజలకు అందించే సౌకర్యాలు, చట్టంపై అవగాహన కల్పించారు. పోలీస్‌ల పాత్రపై అవగాహన కల్పించారు. అకస్మాత్తుగా జరిగే ఘటనలను ఎదుర్కొనే విధానాలు, సెట్ కాన్ఫరెన్స్ ఉపయోగాలు తెలియజేస్తూ వివరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాంరెడ్డి, సతీష్, మహేష్, పలువురు పోలీసులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా వేదరక్షిత బాధ్యతల స్వీకరణ



వేదరక్షిత

కనగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కనగల్ నూతన ఎంపీడీవోగా ఆవ వేదరక్షిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం గ్రూప్ -1 ఫలితాలను విడుదల చేయగా వేదరక్షిత ఎంపీడీవోగా ఎంపికయ్యారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన సుమలత హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు డిప్యూటేషన్‌పై హైదరాబాద్‌కు వెళ్లారు. నూతన ఎంపీడీవోకు ఎంపీవో వీరబాబు, కార్యదర్శులు రాజేందర్ రెడ్డి, ఖాసీం, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. వేదరక్షిత ఉద్యోగ బాధ్యతల స్వీకరణకు ఆమె తల్లిదండ్రులు, అన్న వదినలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వేద రక్షిత మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో బదిలీ అయిన ఎంపీడీవో సుమలత, ఏపీవో సుధాకర్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చిట్యాలరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా యువత, చిన్నారులు అలవాటు పడవద్దని ఎస్ఐ మామిడి రవికుమార్ అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మిషన్ త్రిపుల్ ఆర్‌లో భాగంగా మండలంలోని గుండ్రాంపల్లిలో పోలీస్ కళాజాతా బృందం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఆటపాటలతో కళాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, అందులో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలన్నారు. మానవ అక్రమ రవాణా, బెట్టింగ్ మోసాలు ఇతర అన్యాయాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అయితగోని వెంకటయ్య, కళాబృందం ఏఎస్ఐ (డీటీఆర్‌బీ) సత్యనారాయణ కళాకారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న మేఘారెడ్డి

మునుగోడు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని పేదవాడికి ఏ ఆపద వచ్చిన ఆ కుటుంబానికి అండగా ఉండాలనేదే వెదిరే ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్ వెదిరే మెగా రెడ్డి, వెదిరే విజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన గుంటోజు పావనివేణుగోపాల్‌చారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. పేదవారు కావడంతో వారికి సోమవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణం 25 బస్తాల సిమెంట్, రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించకుండా ఇంటి నిర్మాణ పనులను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోయపర్తి లింగయ్య, జీడిమడ్ల యాదయ్య, బాజా మనోజ్, బత్తుల శ్రీను, జీడిమడ్ల రాజకుమార్, సూర శంకర్, సంకు శంకర్, లింగస్వామి, నరేష్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి

(5వ పేజీ తరువాయి)

ఈ దుకాణానికి 154 దరఖాస్తులు వచ్చాయి. దుకాణం దక్కించుకున్న రాములమ్మ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తామే వ్యాపారం చేస్తామని, ఎవరికీ ఇవ్వబోమని స్పష్టం చేశారు. అదేవిధంగా జిల్లాకు చెందిన ముక్కాముల మహేష్ అనే వ్యాపారి ఐదు దుకాణాలకు దరఖాస్తు చేయగా, అన్నీ దక్కడం విశేషం.

కొత్త దుకాణాలు డిసెంబరు 1 నుంచి

మద్యం టెండర్లలో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30వ తేదీ వరకు వ్యాపారం నిర్వహించాల్సి ఉంటుంది. అందుకుగాను సదరు వ్యాపారులు తొలుత లైసెన్స్ ఫీజులో ఆరోవంతు మంగళవారం సాయంత్రంలోగా చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు నిర్వహించాల్సి ఉంటుంది. సిండికేట్ అయినట్లు తెలిసినా, అందు కోసం ప్రయత్నించినా లైసెన్స్ రద్దు చేస్తామని ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు.

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.00 (305.9222)	36,960	36,960
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	5,015.38	5,015.38
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.176 (41.4867)	33,755	57,858

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి

- ఉత్కంఠగా సాగిన డ్రా ప్రక్రియ
- దర్వేశిపురం దుకాణాన్ని దక్కించుకున్న మహిళ
- ముక్కాముల మహేష్‌కు ఐదు దుకాణాలు..



మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ తీస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉత్కంఠభరిత వాతావరణంలో మద్యం దుకాణాల లైసెన్స్‌దారుల ఎంపిక పూర్తయింది. 2025-27 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణకు లైసెన్స్‌లు ఇచ్చేందుకు ఇటీవల దరఖాస్తులను ఆహ్వానించగా, జిల్లాలో 154 దుకాణాలకు అత్యధికంగా 4,906 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి సమక్షంలో లక్కీడ్రా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు మొదలైన ఈ కార్యక్రమం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎక్సైజ్ అధికారి బి.సంతోష్‌కుమార్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లక్కీడ్రాకు దరఖాస్తుదారులంతా కుటుంబసభ్యులు, భాగస్వాములతో కలిసి హాజరయ్యారు. దీంతో లక్కీడ్రా నిర్వహించే లక్ష్మీగార్డెన్స్ ప్రాంతమంతా కిటకిటలాడింది. డ్రా పూర్తయ్యేంతవరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు పోలీసులు కట్టుదిట్ట బందోబస్తు నిర్వహించారు.

కార్యక్రమం మొత్తం వీడియో రికార్డింగ్

జిల్లాలోని 154 మద్యం దుకాణాలకు సోమవారం లైసెన్స్‌దారులను లక్కీడ్రా ద్వారా ఎంపికచేశారు. ప్రతీ దుకాణానికి వచ్చిన దరఖాస్తులకు టోకెన్ నెంబర్లు కేటాయించి వాటిని ఓ బాక్సులో వేసి డ్రా తీశారు. నిబంధనల ప్రకారం కలెక్టర్ స్వయంగా లక్కీడ్రా కార్యక్రమం కొనసాగించారు. మొత్తం 154 దుకాణాలకు సంబంధించి డ్రా పూర్తయ్యేంతవరకు కార్యక్రమాన్ని వీడియో రికార్డింగ్ చేశారు. డ్రా తీసేటప్పుడు ఆయా దరఖాస్తుదారుల పేర్లు చదివి టోకెన్ నెంబర్లను కేటాయించి అందరి సమక్షంలోనే డ్రాతీసి, దుకాణం దక్కించుకున్న వారి పేరుని ప్రకటించారు.

దర్వేశిపురం దుకాణం మహిళకు

జిల్లాలో అత్యధిక దరఖాస్తులు వచ్చిన కనగల్ మండలం దర్వేశిపురం మద్యం దుకాణాన్ని తిప్పర్తికి చెందిన ఉయ్యాల రాములమ్మగౌడ్ దక్కించుకున్నారు.

- మిగతా 8వ పేజీలో...

పారదర్శకంగా దుకాణాల కేటాయింపు



జిల్లాలో 154 మద్యం దుకాణాలకు సోమవారం పారదర్శకంగా లాటరీ పద్ధతిలో లైసెన్స్‌దారుల ఎంపిక నిర్వహించాం. మొత్తం 4,906 దరఖాస్తులు రాగా, వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.147.18కోట్ల ఆదాయం వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రేటర్ హైదరాబాద్ తర్వాత జిల్లాలోనే అత్యధిక దరఖాస్తులు వచ్చాయి. దుకాణాల నిర్వహణకు ఎంపికైన వారు మంగళవారం సాయంత్రంలోగా దుకాణానికి సంబంధించి ఆరోవంతు లైసెన్స్ ఫీజు చెల్లించాలి. మొత్తం నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తాం. జిల్లాలో గౌడ సామాజికవర్గానికి 34, ఎస్సీలకు 14, ఎస్టీలకు 4 దుకాణాలను కేటాయించగా, మిగిలినవన్నీ ఓపెన్ కేటగిరీలో ఉన్నాయి.

- ఇలా త్రిపాఠి, కలెక్టర్

ఆర్టీసీలో ఇవేం నిర్ణయాలు!

» బస్టాండ్లలో టికెట్ కౌంటర్ల ఎత్తివేత » నాన్‌స్టాప్ బస్ ప్రయాణికులకు ఇబ్బందులు » డ్రైవర్లకు టిమ్స్ యంత్రాలు అందజేత

ఆర్టీసీ అధికారులు ఓ వైపు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూనే మరో వైపు ఇబ్బందులకు గురిచేసేలా నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ప్రధానంగా నాన్‌స్టాప్ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందులు కలిగేలా కౌంటర్లను ఎత్తివేయాలని యోచించడం వివాదాస్పదంగా మారింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



నల్లగొండ బస్టాండ్‌తో పాటు ముఖ్యమైన పట్టణాల్లోని బస్టాండ్లలో ఏర్పాటు చేసిన కౌంటర్లను నిలిపివేయాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే నల్లగొండ బస్టాండ్‌లో నిలిపివేయగా ప్రయాణికుల నుంచి ఒత్తిడి వచ్చిన సమయంలో అప్పుడప్పుడు మళ్లీ కౌంటర్లలో టికెట్లు ఇస్తున్నారు. ఆదివారం లేదంటే పండుగల సమయాలు, ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్నప్పుడు మాత్రమే కౌంటర్లను నిర్వహించాలని, సాధారణ రోజుల్లో కౌంటర్లు అవసరం లేదని అధికారులు భావిస్తున్నారు. జిల్లా కేంద్రమైన నల్లగొండలో ప్రతీ 15 నిమిషాలకోసారి హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ బస్సులు నడుస్తున్నాయి. ప్రతీ రోజు ఉదయం 5 నుంచి రాత్రి 9గంటల వరకు బస్సులు నడుస్తున్నాయి. పల్లె వెలుగుతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన నేపథ్యంలో ఆ బస్సుల్లో రద్దీని తట్టుకోలేక హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు అధిక సంఖ్యలో ఉంటున్నారు. ప్రతీ 15 నిమిషాలకు ఒకసారి నడిచే బస్సులు నిండిన తరువాతనే ఇతర బస్సులకు టికెట్‌లు ఇస్తున్నారు. అయినా ప్రతీ నాన్‌స్టాప్ బస్సు సీట్లు నిండుతున్నాయి. నల్లగొండ బస్టాండ్‌లో నాన్‌స్టాప్ బస్సుల్లో ఆరు సీట్లను మినహాయించి టికెట్లు ఇస్తున్నారు. ఆ ఆరు సీట్లకు జిల్లా కేంద్రంలోని ఐటీ హబ్ ఎదురుగా ఉన్న టికెట్ కౌంటర్‌లో టికెట్ జారీ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు కౌంటర్లు రద్దయ్యాయి. నార్కట్‌పల్లి పరిసర ప్రాంతాలలోని నాన్‌స్టాప్ బస్సుల్లో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం నార్కట్‌పల్లి సమీపంలోని బైపాస్ వద్ద కౌంటర్ ఏర్పాటు చేసి టికెట్ ఇవ్వాలని భావించినా, ప్రస్తుతం దాన్ని సైతం నిలిపివేసినట్లు సమాచారం. నల్లగొండ బస్టాండ్‌లో కౌంటర్లల్లో ఆయా నాన్‌స్టాప్ బస్సుల డ్రైవర్లే టికెట్ ఇచ్చి, ఆ తరువాత బస్సులు నడుపుతున్నారని, దానికి బదులు బస్సులోనే డ్రైవర్లకు టిమ్స్ యంత్రాలు ఇచ్చి టికెట్‌లు ఇవ్వాలని ఆర్టీసీ అధికారులు భావించారు. ఈ మేరకు డ్రైవర్లకు టిమ్స్ యంత్రాలు అందజేశారు. అయితే కౌంటర్లు ఎత్తివేయడంతో నాన్‌స్టాప్ బస్సు రాగానే పరుగుపరుగున వెళ్లి సీట్లలో కూర్చోవడం లేదంటే ఆయా సీట్లలో కర్చీఫ్‌లు వేసి సీట్లు దక్కించుకునే పరిస్థితులు తిరిగి వచ్చాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటి వరకు ప్రయాణికులు కౌంటర్ వద్ద క్యూలైన్‌లో నిలబడి టికెట్ తీసుకొని వారికి కేటాయించిన సీట్లల్లో కూర్చొని గమ్యాన్ని చేరుకునే వారు. కౌంటర్ల వద్ద మహిళలకు, పురుషులకు వేర్వేరు కౌంటర్లు ఉండేవి. ఈ కౌంటర్లను తొలగించడంతో నాన్‌స్టాప్ బస్సు ప్రయాణికులు, ప్రధానంగా మహిళలు ఇబ్బందులు పడతారని పలువురు వాపోతున్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదుల పరిష్కారంపై

ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అదనపు కలెక్టర్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజల నుచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలన్నారు. ఎంతో దూరం నుంచి సమస్యల పరిష్కారానికై ఫిర్యాదుదారులు జిల్లా కేంద్రానికి వస్తున్నారని, ఈ కారణంగా సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా సోమవారం మొత్తం 98 ఫిర్యాదులు రాగా, జిల్లా అధికారులకు 53, రెవెన్యూశాఖకు 45 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, దేవరకొండ, చండూరు ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

నల్లగొండ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గ్రీవెన్స్‌డే సందర్భంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 55మంది అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. కచ్చితంగా న్యాయం జరుగుతుందని బాధితులకు భరోసా కల్పించారు. అలాగే చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిస్థితులకు భంగం కలిగించే వారిపై, నేరస్థులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రుల ఆదేశం

నల్లగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ధాన్యం, పత్తి కొనుగోళ్లలో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సకాలంలో ధాన్యం, పత్తి కొనుగోలు చేసి రైతులకు నష్టం కలగకుండా చూడాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఇప్పటివరకు 80శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, 41వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. జిల్లాలో 23 జిన్నింగ్ పత్తి మిల్లులు ఉన్నాయని, అందులో 9 ఎల్-1 కేంద్రాలు ఉన్నాయని, మునుగోడు, దేవరకొండతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాల నుంచి కొంత పత్తి వస్తోందని అన్నారు. పత్తి సేకరణకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ అమిత్, డీఆర్‌డీవో శేఖర్ రెడ్డి, పౌరసరఫరాల అధికారి వెంకటేష్, పౌరసరఫరాల సంస్థ డీఎం గోపికృష్ణ, మార్కెటింగ్ ఏడీ ఛాయదేవి, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు (ఇన్‌సెట్లో) పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కనగల్: ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. సోమవారం మండలంలోని పగిడిమర్రి గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలుకు ఎంపిక చేసిన స్థలం మరీ చిన్నదిగా ఉండటం, ఇటీవల కురిసిన వర్షాలకు కేంద్రంలో ధాన్యం రాశులు తడవడాన్ని గుర్తించిన కలెక్టర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు సెంటరు ఇన్‌చార్జికి కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం రాశులు తడవకుండా రైతులు టార్పాలిన్ పట్టాలను కప్పి ఉంచాలన్నారు. రైస్‌మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా ధాన్యం లోడ్‌లను ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలన్నారు. శుభ్రపర్చిన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో సుమలత, ఏవో అమరేందర్ గౌడ్, ఏపీఎం మైసేశ్వర్‌రావ్, నాయకులు అనూప్ రెడ్డి, రాజారెడ్డి, జగాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, క్రిష్టారెడ్డి, కేశవ రెడ్డి తదితరులున్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతూ కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి కలెక్టర్‌కు పగిడిమర్రిలో వినతి పత్రం అందజేశారు. ధాన్యం కాంటాలు ఆలస్యమై రోజుల తరబడిగా రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని వివరించారు. తేమ, తరుగు పేరుతో ధాన్యం దిగుమతిలో ఆలస్యం చేస్తున్న రైస్ మిల్లర్లపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి రైతులకు మద్దతు ధర అందేలా చూడాలని కోరారు.

సొంతింటి నిర్మాణం ప్రతి ఒక్కరి కల

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేసుకోవాలి

గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి పత్రాలను అందజేస్తున్న పీడీ రాజ్‌కుమార్, కాంగ్రెస్ నేత మోహన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) సొంతింటి నిర్మాణం ప్రతి ఒక్కరి కల అని గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణ పరిధిలోని 14వ వార్డు మర్రిగూడలో నూతి లక్ష్మయ్య దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఇందిరమ్మ ఇంటిని త్వరితగతిన పూర్తి చేసుకున్నందుకు ఈ సందర్భంగా లబ్ధిదారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులంతా సకాలంలో ఇంటి నిర్మాణం పూర్తి చేస్తే వారికి బిల్లు కూడా త్వరగా వస్తుందన్నారు. 14వ వార్డులో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో 14వ వార్డులోని మర్రిగూడ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని అన్నారు. పార్టీలకతీతంగా ఇల్లు లేని వారందరికీ ఇండ్లు మంజూరు అవుతాయని తెలిపారు. ఇప్పటివరకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు మొత్తం పూర్తి అయితే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ తీసుకున్న వారంతా తప్పనిసరిగా ఇంటిని కట్టుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇందిరమ్మ ఇళ్ల పూర్తి అయ్యేంతవరకు తమ వంతు సహకారం అందించాలని అన్నారు. మర్రిగూడలో కొన్ని కాలనీలలో మిగిలి ఉన్న సీసీ రోడ్లను వేయిస్తానని అన్నారు. అదేవిధంగా 14వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించి మర్రిగూడ అభివృద్ధికి అన్ని విధాలుగా తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ బొజ్జ శంకర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గురిజ వెంకన్న, కాంగ్రెస్ నాయకులు చంద్రారెడ్డి, నాగిరెడ్డి, జాన్ రెడ్డి, సుంకరబోయిన మధు, సత్తయ్య, సాయి, వినేష్, వెంకన్న, సైదులు. ఇస్తారి, రాములు, సుధాకర్, రవి, సైదులు, మహేందర్, చిరంజీవి, ఎల్లేష్, లక్ష్మీనారి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పరిశ్రమను కబళిస్తున్న కార్పొరేట్లు

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి



మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

మిర్యాలగూడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రాధాన్యం కలిగిన బియ్యం పరిశ్రమను కూడా కార్పొరేట్ కంపెనీలు కబళిస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లిలో సోమవారం నిర్వహించిన తెలంగాణ ఆల్ హమాలీ ఫెడరేషన్ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్పత్తి రంగంలో కీలకంగా ఉన్న బియ్యం పరిశ్రమలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు లక్ష మంది, రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది హమాలీ పనిచేస్తున్నారని అన్నారు. వీరికి ప్రభుత్వం ఎటువంటి చట్టబద్ధమైన హక్కులు కల్పించలేదని అన్నారు. ఎఫ్‌సీఐ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థను, గోడౌన్లను ప్రైవేటు పరం చేస్తున్న మోదీ ప్రభుత్వం, అతి పెద్ద రైసుమిల్లులను నెలకొల్పేందుకు అదానీ, అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలు ఇస్తోందని, ఈ పరిణామం ఆర్థికం రంగంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని అన్నారు. మరో వైపు యాంత్రీకరణతో అనేక మంది హమాలీలు ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలతో ఉపాధి మరింతగా మృగ్యం అవుతోందని అన్నారు. జీవో నెం.8 ద్వారా అవుట్‌సోర్సింగ్ రంగంలోని వారికి 8 గంటల పని విధానం స్థానంలో 12గంటలకు పెంచిన ప్రభుత్వం, కార్మికుల ఎలాంటి హక్కులు లేకుండా చేస్తోందని విమర్శించారు. ఐకేపీ కేంద్రాల్లోని హమాలీలకు రైతులు చెల్లిస్తేనే కూలీ డబ్బులు అందుతున్నాయని అన్నారు. కార్మికుల హక్కుల కోసం ఇటీవల నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో దేశవ్యాప్తంగా 25 కోట్ల మంది కార్మికులు పాల్గొన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా కూడా లేదన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి అన్ని రకాల సదుపాయాలను, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, తిరుపతి రాంమూర్తి, అవుట సైదులు, రొండి శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

నల్లగొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 29న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావొస్తుండగా, స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.9వేల కోట్లు విద్యార్థులకు ప్రభుత్వం బాకీ పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగంపై దృష్టిసారించాలన్నారు. 29న జరిగే ముట్టడికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి చల్లా కోటేష్, పిల్లి అభినయ్, అంబటి ప్రణీత్, నోముల శంకర్, నోముల క్రాంతి, లింగయ్య, లక్ష్మణ్ కుమార్, శివకుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

● కార్తీకం.. శుభకరం



పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో..

కార్తీక మాసంలో తొలి సోమవారం కావడంతో జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. సాయంత్రం ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజల్లో పాల్గొన్నారు.

8

నాణ్యమైన పత్తికి మద్దతు ధర



మాదారంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి

శాలిగౌరారం మార్కెట్ చైర్మన్ శంకర్‌రెడ్డి

శాలిగౌరారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మాదారంలోని టీటీఆర్ కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు పత్తి విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, తహసీల్దార్ బిట్ల వరప్రసాద్, మార్కెట్ కార్యదర్శి చిన్నానాయక్, ఏవో సౌమ్యశృతి, సీసీఐ సీపీవో రవీందర్, కాటన్ మిల్లు యజమాని తానం జోజిరెడ్డి, మాదారం మాజీ ఎంపీటీసీ నోముల జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజుల శ్రీనివాస్, నాయకులు గైగుల అవిలయ్య, దేవరకొండ జయరాజు, తుక్కాని లక్ష్మి నరసింహారెడ్డి, షేక్ లతీఫ్, పడాల రమేష్, రవి కుమార్, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

చింతపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటంపేట(తీదేడు) గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్ నాయకులు పాల్గొన్నారు.

కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక బస్సులు

మిర్యాలగూడటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. డిపో నుంచి అన్ని శైవక్షేత్రాలకు ప్రతీ ఆదివారం ప్రత్యేక బస్సు నడిపిస్తున్నామని, చార్జీ పెద్దలకు రూ.1800, పిల్లలకు రూ.1100గా నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు బస్టాండులో, టికెట్లు రిజర్వ్ చేసుకునేందుకు 9298008888 నెంబరును సంప్రదించాలని సూచించారు.

ప్రత్యేక పాలన.. పైసల్లేక హైరానా!

» ఒక్కో ప్రత్యేకాధికారికి 4 జీపీల బాధ్యతలు » సొంత శాఖల్లో పనిభారం » సమావేశాలకే పరిమితం » నిధుల్లేక ఇబ్బందులు



అంగడిపేట గ్రామపంచాయతీ కార్యాలయం

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ఏడాదిన్నరగా ప్రత్యేక పాలన కొనసాగుతోంది. ఉమ్మడి పీఏపల్లి, గుడిపల్లి మండలాల్లో 31 గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. ఒక్కొక్కరికి 4,5 పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు తమ సొంత శాఖల్లోనే పనిభారంతో పల్లెలపై దృష్టి సారించడం లేదు. ఒకవేళ వచ్చిన సమావేశాలకే పరిమితమవుతున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఏడాదిన్నరగా నిలిచిన నిధులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఫైనాన్స్ కమిషన్ (సీఎఫ్‌సీ), రాష్ట్ర పరిధిలోని ఎస్ఎఫ్‌సీ నిధులు ఇరవై నెలలుగా అందడం లేదు. దీంతో పంచాయతీల్లో నయాపైసా లేక పాలన గాడి తప్పింది. మరోవైపు నిధుల్లేక జీతం నుంచి అప్పుతెచ్చి గ్రామాల నిర్వహణకు వెచ్చిస్తున్నామని, వాటిని ఎలా తీర్చాలని కార్యదర్శులు హైరానా చెందుతున్నారు. గ్రామాల్లో పన్నులు ద్వారా ఆదాయం వస్తుంది. కార్యదర్శులు వసూళ్లు చేసి ట్రెజరీలో జమ చేయాలి. తిరిగి వెనక్కి చెక్కు రూపంలో బ్యాంకుల నుంచి తీసుకురావాలి. కానీ అవి కూడా రాకపోతుండటం గమనార్హం. అదే విధంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో దసరా పండుగ ఎలా చేయాలని వారు వాపోతున్నారు.

నిధులు అవసరం

గ్రామాల్లో నెల రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పారిశుధ్య పనులు, దోమల నివారణ చర్యలు, బ్లీచింగ్ పౌడర్, పైప్‌లైన్ల నిర్వహణ, వీధిదీపాల ఏర్పాటు, పల్లె ప్రకృతివనాల నిర్వహణ, బోర్లు, ట్రాక్టర్ల మరమ్మతులు ఇలా దేనికైనా నిధులు అవసరం. గ్రామాల్లోని ప్రజలకు ఏ సమస్య వచ్చినా కార్యదర్శికి చెబుతారు. పరిష్కరించడానికి ఆయన ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లినా పనులన్నీ నిధులతో ముడిపడి ఉండటంతో ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



అన్ని పంచాయతీలకు ప్రత్యేకాధికారులు ఉన్నారు. ఎప్పటికప్పుడు అత్యవసరం అనుకుంటే పంచాయతీలను సందర్శిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు చేశాం. నిధుల విడుదల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశం. మల్టీపర్పస్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు అందిస్తుంది.

\- చంద్రమౌళి, ఎంపీడీవో, పీఏపల్లి

దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా


ప్రమాణస్వీకారం చేస్తున్న సోమేశ్వర ఆలయ నూతన పాలక మండలి

హాలియా, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అనుముల మండలం పేరూరు గ్రామంలోని స్వయంభూ సోమేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని దేవాలయ చైర్మన్ రిక్కల కొండారెడ్డి అన్నారు. సోమవారం దేవాలయంలో నూతన పాలకమండలి ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా రిక్కల కొండారెడ్డి, ధర్మకర్తలుగా యడవల్లి సునీతారాంబాబు, చిన్నబోయిన శ్రీనివాస్, దుండిగల నర్సింహ, కొండోజు సైదాచారి, జానపాటి వెంకన్నయాదవ్ రమావత్ పాండునాయక్ ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం చైర్మన్ కొండారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సహాయంతో దేవాలయ అభివృద్ధికి రూ.1.20కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి నిత్యం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కాకునూరి నారాయణగౌడ్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌రెడ్డి, దేవాలయ కార్యనిర్వాహణాధికారి బి.జ్యోతి, ఆలయ అర్చకులు, సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రెండు రేషన్ దుకాణాలకు నోటిఫికేషన్

మిర్యాలగూడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ డివిజన్‌లో రెండు రేషన్ దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. సోమవారం మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశారు. మిర్యాలగూడ మండలం చింతపల్లి రేషన్ దుకాణాన్ని జనరల్ కేటగిరికి, అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లి షాపును బీసీ జనరల్‌కు కేటాయించారు. దరఖాస్తుదారులు విద్యార్హతలు, కులం, ప్రాంతం ధ్రువీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారితో అటెస్టెడ్ చేయించి 3 కలర్ ఫొటోలతో ఈ నెల 28 నుంచి నవంబరు 6 తేదీ తేదీ వరకు తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు ఫీజు రూ.250 ఎస్‌బీఐ ఖాతా నెం. 52122622519, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0020174, రాజీవ్‌చౌక్, మిర్యాలగూడ పేర చెల్లించిన రశీదును సైతం దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. దరఖాస్తుదారులకు 80 మార్కులతో రాత పరీక్ష, ఇంటర్వ్యూలు ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షలో అధిక మార్కులు సాధించిన వారిని ఇంటర్వ్యూ చేసి డీలర్‌గా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్ డేవిడ్

● సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్ సమక్షంలో చేరిక


డేవిడ్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జానారెడ్డి, జైవీర్‌రెడ్డి

నిడమనూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మండలంలోని వెనిగండ్ల మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పోలే డేవిడ్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన తన అనుచరులతో హైదరాబాద్‌లో సోమవారం సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జానా, జైవీర్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి డేవిడ్ చేరిక దోహదం చేస్తుందన్నారు. డేవిడ్ గతంలో టీడీపీ తరపున బంకాపురం ఎంపీటీసీగా కూడా గెలిచారు. ఆయనతో పాటు ముదిగొండ్ల నాగయ్య, చింతమళ్ల పాండురంగయ్య, వీసాల గోవర్ధన్, చల్లా బాలకృష్ణ, ఇసాక్, సుదర్శన్, రాంబాబు, ఏడుకొండలు, మారయ్య, విజయ్, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఎల్లయ్య, రవి తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుపులేటి సైదయ్యనాయుడు, గండికోట యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి


ఆలయ నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చింతపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. చింతపల్లి మండలంలోని మోద్గులమల్లేపల్లిలో సోమవారం సీతారామచంద్రస్వామి ఆలయ శంకుస్థాపనకు ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్మిస్తున్న ఆలయాలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. నిత్య పూజలు చేయడంతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు అందించి ఆధ్యాత్మికతను ప్రోత్సహించినట్లు తెలిపారు. పార్టీలకతీతంగా ఆలయాల అభివృద్ధికి సహకరించాలన్నారు. గ్రామస్థులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతావత్ బీల్యానాయక్, మాజీ సర్పంచులు సమ్మిడి విజయరాంరెడ్డి, మాజీసర్పంచ్ మర్ల ప్రేమలత వెంకటయ్య, గ్రామపురోహితుడు వైద్యుల రవీంద్రనాథ్‌శర్మ, తమ్మడగోని శ్రీనివాస్, అల్వాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి

(5వ పేజీ తరువాయి)

ఈ దుకాణానికి 154 దరఖాస్తులు వచ్చాయి. దుకాణం దక్కించుకున్న రాములమ్మ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తామే వ్యాపారం చేస్తామని, ఎవరికీ ఇవ్వబోమని స్పష్టం చేశారు. అదేవిధంగా జిల్లాకు చెందిన ముక్కాముల మహేష్ అనే వ్యాపారి ఐదు దుకాణాలకు దరఖాస్తు చేయగా, అన్నీ దక్కడం విశేషం.

కొత్త దుకాణాలు డిసెంబరు 1 నుంచి

మద్యం టెండర్లలో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30వ తేదీ వరకు వ్యాపారం నిర్వహించాల్సి ఉంటుంది. అందుకుగాను సదరు వ్యాపారులు తొలుత లైసెన్స్ ఫీజులో ఆరోవంతు మంగళవారం సాయంత్రంలోగా చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు నిర్వహించాల్సి ఉంటుంది. సిండికేట్ అయినట్లు తెలిసినా, అందుకోసం ప్రయత్నించినా లైసెన్స్ రద్దు చేస్తామని ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు.

రైతుబజారులో పరిశుభ్రత పాటించాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


మునిసిపల్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుబజారులో పరిశుభ్రతను పాటించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. సోమవారం ఉదయం 5 గంటలకు రైతుబజారులో ఆకస్మిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా కూరగాయల వ్యాపారులతో పారిశుధ్యం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయల వ్యర్థాలు, చెత్తాచెదారం వెంటవెంటనే తొలగిస్తూ రైతుబజారును పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాకాలంలో కుళ్లిన కూరగాయలను, తోట కూరలను, ఇతర వ్యర్థాలను నిర్లక్ష్యంగా వదిలివేస్తే వాటిపై ఈగలు, దోమలు వ్యాప్తి చెంది అనేక రోగాలు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు మార్కెట్ పరిసరాల్లోని వ్యర్థాలను తొలగించి తేమ ఉండే ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించి కీటకాలు వ్యాపింప కుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

● దేవరకొండ ఏఎస్పీ మౌనిక



పోస్టర్ విడుదల చేసి మాట్లాడుతున్న దేవరకొండ ఏఎస్పీ మౌనిక

దేవరకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అమరులైన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరకొండ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం దేవరకొండ పోలీస్ స్టేషన్ 125 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక ఓపెన్‌హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ పనితీరు, వివిధ విభాగాలు, ఆయుధాలు, సాంకేతిక పరికరాల గురించి వివరించారు. పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్, లాకప్, రికార్డు రూం, ఆయుధగారం వంటి ముఖ్యమైన విభాగాలను చూపించారు. పోలీస్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. ప్రజలకు రక్షణలో పోలీసుల పాత్ర, అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ, డిండి, కొండమల్లేపల్లి, నాంపల్లి సీఐలు వెంకట్‌రెడ్డి, బీసన్న, నవీన్‌కుమార్, రాజు, ఎస్‌ఐ నారాయణరెడ్డి, సాలకమ్మ, లయన్స్ క్లబ్ నిర్వాహకులు గాజుల రాజేష్, నారాయణరెడ్డి, మల్లయ్యతో పాటు డివిజన్ పరిధిలోని పోలీసులు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శివనామ స్మరణతో మారుమ్రోగిన ఆలయాలు


వేములపల్లి శివాలయంలో సామూహిక పూజలు చేస్తున్న భక్తులు

వేములపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లో శివనామ స్మరణతో మారుమ్రోగాయి. ఈ సందర్భంగా భక్తులు వేకువ జాము నుంచే శివాలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

చింతపల్లి: చింతపల్లి మండలంలోని మోద్గులమల్లేపల్లి గ్రామంలో సీతారామచంద్రస్వామి ఆలయ శంకుస్థాపనలో భాగంగా ప్రాంగణంలో భక్తులు సోమవారం సుదర్శన హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి సమ్మిడి ప్రకాష్ రెడ్డి, సమ్మిడి విజయరాంరెడ్డి, మేకల యాదగిరి రెడ్డి, మాజీ సర్పంచ్ మర్ల ప్రేమలత వెంకటయ్య, హన్మంతు, క్రాంతిరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం



తిరుమలగిరి (సాగర్): ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దేవరకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్ విమర్శించారు. దేవరకొండలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న 8150 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేసేంత వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ముత్యాలు, రామలింగం, గుండాల మల్లేష్, సింహాద్రి, వరుణ్‌తేజ్, ఆంజనేయులు, మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విచారణ చేసి చర్యలు తీసుకోవాలి

తిరుమలగిరి(సాగర్): మండలంలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్లపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల విషయంలో అవకతవకల సరిచేయాలని పలుమార్లు విన్నవించినా తగిన చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. వెంటనే డీఈవో, కలెక్టర్ స్పందించి డిప్యూటేషన్ల వ్యవహారంపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరె రమేష్, నాయకులు బుడిగపాక వర్షిత్, సాగర్, కిషన్, గోపి, శివ, రాకేష్, రవి పాల్గొన్నారు.

ఎంపీడీవోగా వంశీధర్ బాధ్యతల స్వీకరణ


వంశీధర్

మాడ్గులపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీవోగా జి.వంశీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీడీవోగా పనిచేసిన తిరుమలస్వామి మూడు నెలల క్రితం వికారాబాద్‌కు బదిలీపై వెళ్లగా ఇన్‌చార్జిగా సంగీత పనిచేశారు. ఇటీవల వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో ఉద్యోగం పొందిన వంశీధర్ ఎంపీడీవోగా నియామకమై బాధ్యతలు స్వీకరించారు. ఆయన వెంట జడ్పీ సూపరింటెండెంట్ నరేందర్‌రెడ్డి ఉన్నారు.

'మధ్యాహ్న' కార్మికులకు వేతనాలు పెంచాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచి ఇవ్వాలని, వేతనాల పెంపు ప్రకటనలకే పరిమితం చేయవద్దని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయీద్ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న కార్మికులకు వేతనాల చెల్లింపులకు నిధులు విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమ కాలేదని అన్నారు. సంవత్సర కాలం నుంచి వంట బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా కార్మికులకు రూ.10వేల వేతనం చెల్లించాలని అన్నారు. ప్రభుత్వమే కోడిగుడ్లను సరఫరా చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. వంట గ్యాస్ సరుకులను ప్రభుత్వమే సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 9వ తరగతి బడ్జెట్‌ను పీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు రాజేశ్వరి, జిల్లా నాయకురాలు విజయలక్ష్మి, కార్మికులు రహీమున్నీసా, సుజాత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో పాఠశాల ఏర్పాటు చేయాలి

● గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు కాలనీవాసుల వినతి


డీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న కాలనీవాసులు

మిర్యాలగూడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని చింతపల్లి ఇందిరమ్మ కాలనీలో పాఠశాల ఏర్పాటు చేయాలని కాలనీవాసులు అంబటి వెంకటకృష్ణ, పల్లె భాస్కర్ కోరారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో భాగంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీ ఏర్పాటై 20 సంవత్సరాలు గడిచినా పిల్లలు చదువుకునేందుకు పాఠశాల ఏర్పాటు చేయలేదని అన్నారు. దీంతో పిల్లలు సుమారు 3 కిలోమీటర్ల దూరంలోని స్కూల్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్‌కు వెళ్లేందుకు పిల్లలు అద్దంకి - నార్కట్‌పల్లి రహదారిని దాటాల్సి ఉందన్నారు. భారీ వాహనాలు, బస్సులతో నిరంతరం రద్దీగా ఉండే రహదారిని దాటేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. చిన్నారులను దృష్టిలో ఉంచుకొని పాఠశాల ఏర్పాటుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కాలనీవాసులు రాచూరి బిక్షం, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయం

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయమని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ సమరథ్ అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆహార పంపిణీ కార్యక్రమం సోమవారం 762 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులు, వారి సహాయకులు ఆహారాన్ని అందించడం గొప్ప విషయమన్నారు. క్లబ్ సీనియర్ సభ్యుడు కోల సైదులు మాట్లాడుతూ సేవలను విస్తృత పరుస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రముఖులు, క్లబ్ సభ్యుల పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవం తదితర శుభ సందర్భాలను పేదలు, రోగుల మధ్య నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు క్యామ వెంకటేశం, రావుల నాగేశ్వరరావు, రావుల కీర్తన, నాయుడు, లింగయ్య, మురహరి, భాగ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, రాజు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిరావాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ మాదిగ

కొండమల్లేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడికి ఇప్పటికి కేసు నమోదు చేయకపోవడాన్ని నిరసిస్తూ నవంబరు 1వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి దళితులంతా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పాలకేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య హాజరై మాట్లాడారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో ఉన్న దళితుడికే రక్షణ లేకపోతే దేశంలో సామాన్య దళితులకు రక్షణ ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. తక్షణమే దాడి ఘటన మీద కేసు నమోదు చేయాలని, నిందితుడిని అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకుడు ఎదుళ్ల ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల నాయకులు గడ్డం శ్రీరాములు మాదిగ, జానయ్య మాదిగ, బబాలకృష్ణ, అజయ్, సాలయ్య, రమేష్, వెంకటయ్య పాల్గొన్నారు.